Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 139 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 జూన్ 2023 శుక్రవారం పేజీలు : 4

### బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రతి రోజూ పెరుగుతూ తగ్గుతూ ఉన్నాయి. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఇటీవలి కాలంలో వరుసగా పెరగడమో.. తగ్గడమో జరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్ కాబట్టి బంగారం, వెండి కొనక తప్పడం లేదు. మహిళలతో బంగారం షాపులన్నీ కిటకిటలాడు తున్నాయి. మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే బంగారం ధర కొన్ని ప్రాంతాల్లో దాదాపు రూ.62 వేలకు చేరుకుని షాక్ ఇచ్చింది. నేడు మాత్రం బంగారం ధర కాస్త ఊరటనిచ్చింది. నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.10 తగ్గి రూ.55,9 30కి చేరుకోగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.61,020కి చేరుకుంది. ఇక కిలో వెండిపై మాత్రం రూ.1100 మేర తగ్గింది. నేడు కిలో వెండి ధర రూ.77,400కి చేరింది.

# పసికూన అయిన పది సంవత్సరాల తెలంగాణ..

# మిగతా రాష్ట్రాలతో పోటీ పడుతోంది : సీఎం కేసీఆర్



మంచిర్యాల : పసికూన అయిన పది సంవత్సరాల తెలంగాణ.. మిగతా రాష్ట్రాలతో పోటీ పడుతోంది అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న తెలంగాణ.. కేంద్రం నుంచి అనేక అవార్డులను అందుకుందని కేసీఆర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభించుకున్న అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. ఈ రోజు మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మనందరం చేసిన పోరాటంతో తెలంగాణ సాధించుకున్నాం. పరిపాలన సంస్కరణల కోసం నూతన కలెక్టరేట్‌లను నిర్మించుకున్నాం. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. మంచిర్యాల జిల్లా డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కాబట్టే మంచిర్యాలను జిల్లాగా ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు మంచి జరగాలనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌ను కూడా త్వరలోనే ప్రారంభించుకోబోతున్నాం. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ టాప్‌లో ఉందన్నారు. ప్రజలకు వారధిగా ఉద్యోగులు పని చేయడంతో, మంచి ఫలితాలను సాధించాం. తెలంగాణ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉంది. అనేక రికార్డులను నెలకొల్పాం. కరోనా, నోట్ల రద్దు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. కష్టకాలంలోనూ తెలంగాణ అభివృద్ధిలో ముందుంది. కులమతాలకు అతీతంగా అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తున్న అధికారులకు అభినందనలు. కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని, రెండో విడుత గొర్రెల పంపిణీ పథకాన్ని మంచిర్యాల



నుంచే ప్రారంభించుకోబోతున్నాం.

గొర్రెల పెంపకంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. మానవీయ కోణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఆరోగ్య శాఖ బ్రహ్మాండమైన పురోగతి సాధించింది. మాతాశిశు మరణాలు తగ్గాయి. కంటి వెలుగు లాంటి పథకం దేశంలో ఎక్కడా లేదు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీ, పంజాబ్‌లో కూడా ఆ ముఖ్యమంత్రులు కూడా అమలు చేశారని సీఎం కేసీఆర్ తెలిపారు.

**కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్ :** రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు పథకాలను ప్రారంభించింది. నూతన పథకాలైన గృహలక్ష్మి, కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాలతో పాటు రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని మంచిర్యాల జిల్లా వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి, బీసీ కులాల్లోని కులవృత్తుల లబ్దిదారులకు కేసీఆర్ ఆర్థిక సాయాన్ని అందించారు. రెండో విడుత గొర్రెల పంపిణీ కింద లబ్దిదారులకు కేసీఆర్ గొర్రెలను పంపిణీ చేశారు. గృహలక్ష్మి, కులవృత్తుల వారు, గొర్రెల లబ్దిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చెన్నయ్య, జోగు రామన్న, దివాకర్ రావు, రేఖా నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





**నల్గొండలోని ఎన్జీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై చేప వంటకాలను రుచి చూశారు.**

## ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తాం..



హైదరాబాద్: అభయ హస్తం పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కత్రియ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17న మేనిఫెస్టో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. పలు పార్టీల నేతలతో అధిష్టానం చర్చలు జరిపిందని, ప్రజలు కోరుకుంటున్న విధంగానే చేరికలు ఉంటాయని, కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్ అవుతాయన్నారు. సీఎం కేసీఆర్‌కు తన పేరు తీసే దైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దమ్ముంటే తన పేరు తీయాలని ముఖ్యమంత్రికి సవాలు విసురుతున్నానన్నారు. తన భూమి వివరాల కోసం చాలా రోజుల నుంచి రంగారెడ్డి కలెక్టర్ దగ్గరకి తిరుగుతున్నానని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చుకున్నారని విమర్శించారు. భూస్వాములను తరిమి కొట్టడానికే నక్షల్బరీ ఉద్యమం వచ్చిందని, ధరణిలో పోర్టల్ ప్రభుత్వం చేతిలో లేదని, దళారుల చేతిలోకి పోయిందని అన్నారు. ధరణి లేకపోతే రైతుబందు రాదనడం బ్రతక్కువ పని అని మండిపడ్డారు. ధరణి మోసాల వల్ల కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకి వెళ్తుందన్నారు. చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామన్నారు. బావ బామ్మర్దులు (కేటీఆర్, హరీష్ రావు) వస్తే బహిరంగంగా చర్చిద్దామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలోనైనా చర్చకు సిద్దంగా ఉన్నామన్నారు. రెండు వేల రూపాయలకు రెండు ఫుల్ బాటిల్స్ కూడా రావడం లేదన్నారు. తండ్రి కొడుకులు నిప్పుతొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబంలా ప్రజలను దోచుకోమని స్పష్టం చేశారు. సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపంపై ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేయిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇంతటి సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వంలో చూడలేదు



నిజామాబాద్: ఏ ప్రభుత్వంలో అయినా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు చూడలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన తెలంగాణ సంక్షేమ సంబరాల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రానికి సంక్షేమ పథకాలకు ఎన్నో దేశ స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళ బాధలను అర్థం చేసుకుని ఒంటరి మహిళలకు ఆసరా పథకం అందించారని తెలిపారు. రాష్ట్రంలో 33 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసి డయాలసిస్ బాధితులను కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రైతులకు కేసీఆర్ అండగా నిలిచారని.. మావాడు కేసీఆర్ అని రైతులు అంటున్నారని అన్నారు. దేశంలోని రైతులు కేసీఆర్ పాలన తమకు కావాలని కోరుతున్నారని చెప్పారు. బీజేపీ సోషల్ మీడియాతో కాలం గడుపుతున్నారని.. తప్పుడు సంక్షేమ పథకాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఇళ్ల లేనివారికి, ఇళ్ల స్థలాలు లేనివారికి కేసీఆర్ త్వరలో మంచి పథకం తీసుకురానున్నారని తెలిపారు. ఎవరూ అడిగారని కంటి వెలుగును ప్రభుత్వం పెట్టలేదని కవిత పేర్కొన్నారు.





**గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా వర్ధంతిని పురస్కరించుకొని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బండి సంజయ్ తదితరులు నివాళులు అర్పించారు.**

# ఏకతాటిపైకి ప్రతిపక్షాలు!?

## 450 నియోజకవర్గాల్లో వన్ టూ వన్ ఫార్ములా ప్రతిపక్షాలకు కలసి వచ్చేనా?



వచ్చే వేసవిలో లోక్ సభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వరుసగా మూడోసారి విజయం సాధించడానికి అధికార బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. అయితే బీజేపీ గెలుపొందడం సులువు కాదని చెబుతున్నారు. బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించాలని కంకణం కట్టుకున్న ప్రతిపక్షాలు విభిన్న వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. ముందుగా బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నింటినీ ఒక గూటి కిందకు తీసుకురావడంతోపాటు ఎన్నికల్లో బీజేపీతో ప్రతిపక్షాల తరఫున ఎవరో ఒకరు మాత్రమే పోటీ పడాలనేది ముఖ్య నిర్ణయం. దీనివల్ల ప్రతిపక్షాల ఓట్లు చీలి బీజేపీ లాభపడకుండా చూడొచ్చని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ.. ఈ వన్ టూ వన్ ఫార్మ్యులాను తెరమీదకు తెచ్చారు. దీని ప్రకారం మొత్తం 543 లోక్ సభ స్థానాల్లో 450 నియోజకవర్గాల్లో వన్ టూ వన్ ఫార్ములాను అమలు చేయనున్నారని సమాచారం. దీని ప్రకారం.. ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చోట ఆ పార్టీల అభ్యర్థులు బీజేపీపైన పోటీ చేస్తారు. ఉదాహరణకు తమిళనాడులో డీఎంకే చాలా బలంగా ఉంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిపై డీఎంకే పోటీ చేస్తుంది. అలాగే బీహార్ లో జేడీయూ ఆర్జేడీ బలంగా ఉన్నాయి. ఇక్కడ బీజేపీపైన ఈ రెండు పార్టీల తరఫున ఒకరు పోటీ చేయనున్నారు. అలాగే ఉత్తరప్రదేశ్ లో అఖిలేష్ యాదవ్ కు చెందిన సమాజవాదీ పార్టీ బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ లో బీజేపీ వ్యతిరేక పార్టీల తరఫున బీజేపీ అభ్యర్థిపై సమాజవాదీ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారు. ఇదే సూత్రాన్ని బీజేపీ వ్యతిరేక పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తారు. ఇక కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ఛత్తీసగఢ్ రాజస్థాన్ మధ్యప్రదేశ్ హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్ కర్ణాటక తెలంగాణ వంటి రాష్ట్రాల్లో బీజేపీ అభ్యర్థులపై అన్ని ప్రతిపక్ష పార్టీల తరఫున కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తారు. ఈ మేరకు వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొనే విషయంలో వ్యూహాన్ని రూపొందించడానికి ప్రతిపక్ష పార్టీలు ముహూర్తం ఖరారు చేశాయి. జూన్ 23న బిహార్లోని పాట్నా వేదికగా విపక్ష నేతలు కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు . ప్రధానంగా అత్యధిక స్థానాల్లో బీజేపీపై ద్విముఖ పోరుకు దిగాలని విపక్షాలు వ్యూహరచన చేస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మొత్తం 543 లోక్సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కనీసం 450 స్థానాల్లో బీజేపీ అభ్యర్థిపై ప్రతిపక్షాల్లో కేవలం ఒక పార్టీ నుంచే అభ్యర్థిని నిలబెడతారని తెలుస్తోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. జూన్ 23న ఈ వ్యూహంపైనే ప్రధానంగా చర్చించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

## సంపాదకీయం

### విడిపోయాక కూడా ఈ మాటల మంటలు అవసరమా?

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ఏపీ తెలంగాణ నేతల మధ్య చిచ్చు రాజేసిన సంగతి తెలిసిందే. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా తాము ఆసక్తి వ్యక్తీకరణ కోసం బిడ్డు దాఖలు చేస్తామని కొద్ది రోజుల క్రితం తెలంగాణ మంత్రులు ప్రకటించారు. కొద్ది రోజుల్లో సింగరేణి నుంచి నిపుణుల బృందం స్టీల్ ప్లాంట్ ను సందర్శిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రాలో ఆయా పార్టీల నేతలకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ మంత్రులు నేతల వ్యాఖ్యలపై వైసీపీ నేతలు కూడా ఘాటు విమర్శలు చేశారు. బొత్స సత్యనారాయణ కారుమూరి నాగేశ్వరరావు సీదిరి అప్పలరాజు పేర్ని నాని తదితరులు బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఈ క్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే చేసిన వ్యాఖ్యలు ఈ చిచ్చును పెంచడానికి మరింత ఆజ్యం పోశాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలనుకోవడం లేదని ఆయన తాజాగా విశాఖ పర్యటనలో వ్యాఖ్యానించారు. దీంతో కేటీఆర్ హరీష్ రావు.. కేసీఆర్ దెబ్బకు కేంద్రం దిగివచ్చిందని.. ఏపీలో బీఆర్ఎస్ సాధించిన తొలి విజయం ఇదంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్ హరీష్ వ్యాఖ్యలపై వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కానన్నట్టు బీఆర్ఎస్ నేతల వ్యవహారం ఉందని మండిపడ్డారు. చంద్రబాబులాగా మామను వెన్నుపోటు పొడవటానికి హరీష్ రావు సిద్ధంగా ఉన్నాడని విమర్శించారు. ఇక పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. బీఆర్ఎస్ నేతలు ప్రాంతీయ ఉన్మాదులని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో మెజారిటీ పెట్టుబడులు ఏపీ వారివేనని తెలిపారు. ఇప్పటికీ నిధులు నీళ్ల విషయంలో ఏపీ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంత్రి సీదిరి అప్పలరాజుకు ఫోన్ వెళ్లినట్టు.. ఇలా తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఏమిటని తలంటినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయినా రెండు రాష్ట్రాలు విడిపోయి ఎవరి పాలన వారు సాగించుకుంటున్నాయి. ప్రజలు కూడా విడిపోయినా అన్నదమ్ముల్లానే జీవిస్తున్నారు. అయితే రెండు రాష్ట్రాల్లో అధికార పార్టీలు.. బీఆర్ఎస్ వైసీపీ నేతలు మాత్రం మాటల తూటాలను వదులుతూ మరోమారు విద్వేషాలను పెంచుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కేసీఆర్ కు జగన్ జగన్ కు కేసీఆర్ సహకరించుకోవడంలో భాగంగానే ఇదంతా జరుగుతుందనే వ్యాఖ్యానాలు కూడా వినవస్తున్నాయి. భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడంలో కేసీఆర్ తర్వాత ఎవరైనా అని.. దానికి తగ్గట్టే వైసీపీ నేతల వ్యవహారం ఉందని అంటున్నారు. నేతల మధ్య మాటల తీవ్రత తగ్గాల్సిన అవసరం ఉందని.. ప్రజల మధ్య మరోమారు విభేదాలు సృష్టించే ప్రయత్నాలు వద్దని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# రాజధానికి ఒక్క రైలే దిక్కు..



మంచిర్యాల : కుమురంభీం, మంచిర్యాల జిల్లా వాసులకు హైదరాబాద్ వెళ్లేందుకు రైళ్లు లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఒక్కటే దిక్కయింది. జమ్మికుంట– ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైను పనుల కారణంగా జూన్ 27 నుంచి జులై 20 వరకు ముఖ్యమైన రైళ్లను రద్దు చేయడమే కాకుండా 12 రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రోడ్డుమార్గమే శరణ్యం..**


సిర్పూర్ కాగజ్‌నగర్– సికింద్రాబాద్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట – సిర్పూర్‌టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజరు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. భద్రాచలంరోడ్ – బల్లార్షాల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజరు భద్రాచలం రోడ్ నుంచి వరంగల్ వరకు, సికింద్రాబాద్ – బల్లార్షాల మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ కాజిపేట వరకు మాత్రమే నడుస్తుంది. దీంతో జిల్లా ప్రజలకు రెండు రైళ్లు అందుబాటులోకి రావడం లేదు. జిల్లా వాసులకు సికింద్రాబాద్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లాలంటే రైలు మార్గమే సులువుగా ఉంటుంది. రోడ్డుమార్గంలో వెళ్లాలంటే కరీంనగర్ మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇలా చాలా దూరంతో పాటు అధిక సమయం, ఆర్థిక భారం పడుతుంది. దీంతో ఎక్కువగా ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు రైళ్లనే ఆశ్రయిస్తారు. మూడోలైను పనుల కారణంగా కేవలం ఇంటర్‌సిటీ (మంచిర్యాలలో మధ్యాహ్నం 12.49 గంటలకు) ఒక్కటే ఇప్పుడు అందుబాటులో ఉంది. ఢిల్లీ – హైదరాబాద్ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. కానీ.. ఇందులో కేవలం నాలుగు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి. మిగతావన్నీ రిజర్వేషన్‌తో ఉంటాయి. సాధారణంగానే తెలంగాణ రైలులో జనరల్ బోగీలు కిక్కిరిసి ఉంటాయి. అందుకే ఇందులో ప్రయాణం కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. ఇది కేవలం మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్‌లోనే ఆగుతుంది. మిగతా రైల్వేస్టేషన్లకు వెళ్లే ప్రయాణికులు లేదా అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులు ఇంటర్‌సిటీని మాత్రమే ఆశ్రయించాల్సి ఉంది.

**భాగ్యనగర్ నడపవచ్చు...** 24 రోజుల పాటు ముఖ్యమైన రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. ముఖ్యంగా మంచిర్యాల నుంచి ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ వెళ్లేందుకు అనువైన రైలు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్. ఈ రైలులో సికింద్రాబాద్‌కు ఉదయం 11 గంటలలోపు చేరుకొని తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు రైలు బయలుదేరి రాత్రి 8.30గలకు మంచిర్యాలకు వస్తుంది. ఈ రైలులో ఎక్కువగా విద్యార్థులు, వ్యాపారులు, ఆసుపత్రులు ఇతరత్రా కారణాలకు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. కాబట్టి కాషన్ ఆర్డర్ మ్యానువల్‌గా భాగ్యనగర్ వంటి డిమాండ్ ఉన్న రైలును నడపవచ్చని రైల్వే నిపుణులు సూచిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్‌నేతతో పాటు జిల్లా శాసనసభ్యులు రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకువస్తే సమస్యకు పరిష్కారం దొరికే వీలు లేకపోలేదు.

**అందుబాటులో ఆర్టీసీ బస్సులు..**

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు మూడు నుంచి ఐదు బస్సులను అదనంగా నడిపిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్‌కు రూ.360, డీలక్స్‌కు రూ.410, సూపర్‌లగ్జరీకి రూ.460, రాజధానికి రూ.600 టికెట్టు ధరలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# యువ హస్తం.. వైద్య నేస్తం



మంచిర్యాల : వైద్యుడు.. కనిపించే దేవుడు. తెల్లకోటు చాటున ఎల్లలు లేని ప్రేమను చూపించి కరోనా కాలంలో ప్రాణ త్యాగాలు చేశారు. కొంతమంది మారుమూల గ్రామాల్లో పనిచేస్తూ సర్కారు సేవలోనే పూర్తి సమయాన్ని గడుపుతూ మెప్పుపొందుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా యువవైద్యులే ఎక్కువగా ఉన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వరంగంలో సేవలందిస్తున్న యువవైద్యులపై కథనం.

**ప్రశాంతంగా ఉంటూ..పని చేసుకుంటూ**

క్యాతనపల్లి మండలానికి చెందిన డా.రమేష్ ప్రస్తుతం పాతమంచిర్యాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. పన్నెండేళ్లుగా మంచిర్యాల ప్రజలకు ఆరోగ్యసేవలందిస్తున్నారు. ఎంబీబీఎస్ అనంతరం 2004లో తాత్కలిక పద్ధతిలో చేరారు. ఆర్టీసీ కార్మికులకు సైతం ఆరేళ్లపాటు తన సేవలందించి ఉద్యోగుల మెప్పుపొందారు. కాలనీల్లో పర్యటించినా ఎప్పుడు ప్రశాంతంగా కనిపిస్తూ ఓపికగా సమాధానమిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. కరోనా వేళ సమయానికి మించి కేంద్రంలో ఉంటూ బాధితులకు సేవలందించారు.

**రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు**

మారుమూల గాదిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.పవన్‌కుమార్ ఆదివాసీ గర్భిణులు ఎక్కువ మంది రక్తహీనతకు గురవుతుండటం గమనించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నివారణకు కృషి చేస్తున్నారు. ప్రజారోగ్య సిబ్బంది ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన వారికి ఐరన్ సుక్రోజు ఇంజక్షన్‌లు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పీహెచ్‌సీ ఆదిలాబాద్ రిమ్స్‌కు దాదాపు 55 కి.మీ.దూరంలో ఉండటంతో అక్కడి గ్రామాల వారికి సరైన రహదారి సౌకర్యం లేక ఇక్కడి వరకు రాలేకపోతారు. దీంతో ఆయన ప్రత్యేకంగా ఆదివాసీ గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్‌లు అందిస్తున్నారు. ఇళ్ల వద్దనే ప్రసవాలు ఎక్కువగా ఇటీవలి వరకు జరిగేవి. వీటిని ఆయన పూర్తిగా కట్టడి చేయగలిగారు.

ఆర్థో వైద్యుల కొరత తీరుస్తూ..కీళ్లు, ఎముకల శస్త్రచికిత్సల్లో అందెవేసిన చేయిగా అనతికాలంలోనే గుర్తింపు పొందారు మంచిర్యాలకు చెందిన డా.ప్రవీణ్‌కుమార్. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలందిస్తున్నా తన(టీవీవీపీకి చెందిన) సహకారం సైతం ఇస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మొదట తాత్కలిక (ఎంబీబీఎస్) వైద్యుడి హోదాలో చేరి, సంబంధం లేకున్నా ఆసుపత్రిలో ఆర్థో వైద్యుల కొరత, రోగులు పడుతున్న ఇబ్బందిని గుర్తించి మానవత్వాన్ని చాటారు. ఆయా సేవలందించడంతో పాటు అరుదైన శస్త్రచికిత్సలుచేసి బాధితులతో పాటు ఇతర వైద్యుల ప్రశంసలు పొందారు. అనంతరం ఆయన స్థానంలో శాశ్వత వైద్యుడు చేరడంతో రాజీనామా చేసి ఇటీవల మరోసారి అవకాశం రావడంతో తిరిగి విధుల్లో చేరి గత తీరును కనబరుస్తున్నారు.

**ప్రత్యేక వైద్య శిబిరాలు**

గ్రామీణ నేపథ్యమున్న ముత్యాల సురేష్ బజార్‌హత్నూర్ ఏజన్సీ పీహెచ్‌సీలో 2019 నుంచి వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. రహదారులు లేని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆదివాసీలకు సేవలందిస్తున్నారు. ప్రధానంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కరోనా కారణంగా నిలిచిపోయినప్పటికి ఆ పీహెచ్‌సీలో వీటిని కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 150 వరకు కుని శస్త్ర చికిత్సలు చేశారు. అంతేగాక పీహెచ్‌సీ వరకు రాలేని గర్భిణుల వివరాలను తెలుసుకొని వారి గ్రామాలకే వెళ్లి అవసరమైన వైద్యసాయం అందిస్తుంటారు.

**మారుమూల ప్రాంతాల్లో.. ప్రజా సేవలో**

బెల్లంపల్లికి చెందిన డా.ఝాన్సీరాణి తన నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలందించడంలో నిమగ్నమవుతోంది. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వెంటనే తాత్కలిక వైద్యురాలిగా నెన్నెల పీహెచ్‌సీలో 2014లో చేరి అతి తక్కువ సమయంలోనే అక్కడి ప్రజల మెప్పు పొందారు. 2018లో శాశ్వత వైద్యురాలిగా గుర్తింపు లభించింది. ఆ తర్వాత మారుమూల ప్రాంతాలు కాసిపేట, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ విధులు నిర్వర్తించారు. ముఖ్యంగా కరోనా సమయంలో బాధితులకు మెరుగైన సేవలందించారు. ప్రస్తుతం నెన్నెల వైద్యాధికారితో పాటు బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ యూపీహెచ్‌సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# పనులు నత్తనడక

ఖమ్మం : నగరంలోని ప్రధాన రహదారుల్లో బోనకల్లు క్రాస్‌రోడ్డు–ముస్తఫానగర్ ఒకటి. నగర శివారు ప్రాంతానికి, బోనకల్లు వైపు వెళ్లే వేలాది వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత అవసరాలకు తగినట్లు సరిపోవడంలేదని ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. కానీ నెలల తరబడి కొనసాగుతుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాత రహదారికి ఇరువైపులా తవ్వి చదును చేసే పనులు చేపట్టారు. ఈ క్రమంలో తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. వీటి స్థానంలో కొత్తవి వేయడం, దెబ్బతిన్న ప్రాంతంలో సరిచేయడం వంటి పనులు పూర్తి చేయలేదు. దీంతో ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు, ఇళ్లలోకి వెళ్లడానికి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే అంతర్గత రహదారులకు లింకు లోపలిప్రాంతంలో నివసించేవారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అంచులు సక్రమంగా లేక ప్రధాన రహదారిపై వెళ్లేవారు సైతం ప్రమాదాలబారిన పడుతున్నారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సబ్సిడీ గొర్రెలకు మోక్షమెప్పుడో..?

పెద్దపల్లి)రెండవ విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ ప్రకటనలకే పరిమితం అవుతోంది. మూడేళ్లుగా ఇప్పుడు, అప్పుడు అంటూ ప్రభుత్వం ఊరిస్తూ వస్తున్నది. ఇటీవల ఎన్‌సీడీసీ ప్రభుత్వానికి రుణం మంజూరు చేయడంతో ఈసారైనా గొర్రెలు పంపిణీ చేస్తారా, చేయరా..? అనే విషయమై జిల్లాలో చర్చ జరుగుతోంది. గొల్ల, కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2017లో సబ్సిడీ గొర్రెల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఇచ్చే ఒక్కో యూనిట్ వ్యయం లక్షా 25 వేల రూపాయలుగా నిర్ణయించారు. ఇందులో 75 శాతం సబ్సిడీ కింద ప్రభుత్వం 93,250 రూపాయలు, లబ్ధిదారుడి వాటా 25 శాతం 31,250 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రాథమిక గొర్రెలకాపరులు సహకార సంఘంలో 18 సంవత్సరాలు నిండి సభ్యత్వం ఉన్న వారందరినీ అర్హులుగా పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 21,254 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరందరికీ రెండు విడతల్లో గొర్రెలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల పేర్లను డ్రా ద్వారా సగం మందిని మొదటి సంవత్సరానికి ఎంపిక చేశారు. మిగతా వారికి తర్వాత ఏడాది ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మొదటి విడతలో 10,642 మంది లబ్ధిదారులకు 2018 వరకు గొర్రెలను పంపిణీ చేశారు. అదే ఏడాది జూన్ మాసం నుంచే రెండవ విడతలో మిగిలిన 10,612 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇవ్వలేదు. 2018 సెప్టెంబర్‌లో ప్రభుత్వానికి రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో వాయిదా పడ్డాయి. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పది మాసాల వరకు వరుసగా పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు జరగడంతో కోడ్ వల్ల గొర్రెల పంపిణీ చేయలేక పోయింది. ఆ తర్వాత పంపిణీ చేస్తుందని గొల్ల, కుర్మలు ఆశించారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. బడ్జెట్ లేదంటూ వాయిదా..మూడున్నరేళ్లుగా బడ్జెట్ లేదనే కారణంగా ఇప్పుడు, అప్పుడు అంటూ వాయిదా వేస్తూ వస్తున్నది. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రెండవ విడత గొర్రెల పంపిణీ విషయమై అసెంబ్లీ వేదికగా, బహిరంగంగా ఇప్పుడు, అప్పుడు అంటూ పలుసార్లు ఆశలు రేకెత్తించారు. బడ్జెట్‌లోనూ బడ్జెట్ పెట్టామంటూ చెబుతూవచ్చారు. కానీ ఇప్పటివరకు గొర్రెల పంపిణీ జరగలేదు. దీంతో గొల్ల, కుర్మలు సబ్సిడీ గొర్రెలపై ఆశలు వదులుకుంటున్నారు. ప్రభుత్వం ఒక ప్రణాళిక అంటూ లేకుండా ముందుకు సాగడం వల్లనే రెండవ విడత గొర్రెల రావడం లేదనే విమర్శలున్నాయి. ఓట్ల కోసం అర్హులైన వారందరికీ గొర్రెలను ఇస్తామని చెప్పి సగం మందికి ఇచ్చి మళ్లీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని అంటున్నారు. ఇటీవల ప్రభుత్వానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) ద్వారా రుణం మంజూరు చేయడంతో గొల్లకుర్మల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెలను పంపిణీ చేయాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# శాపంగా మారిన సింగరేణి భూ సేకరణ

రామగిరి : ఒకప్పుడు పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు అందుకున్న గ్రామం.. చుట్టూ పచ్చని పంట పొలాలు, ఎటు చూసినా ప్రకృతి అందాలు పాడిపంటలతో అలరారిన బుధవారంపేట్ నేడు అభివృద్ధికి ఆమడదూరంగా నిలిచింది. సింగరేణి యాజమాన్యం గనుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ ఆదర్శ గ్రామానికి శాపంగా మారింది. సింగరేణి సంస్థ ఆర్జీ–3 డివిజన్ పరి?ధిలోని ఓసీపీ–2 ప్రాజెక్టు విస్తరణ పనుల కోసం రామగిరి మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో 17 సంవత్సరాల క్రితమే భూసేకరణ చర్యలు ప్రారంభించారు. గ్రామంలోని సుమారు 200 వందల మందికి చెందిన 708.16 ఎకరాల భూసేకరణకు డీఎన్‌డీడీ (డేట్‌ఆఫ్ నోటిఫికేషన్, డేట్‌ఆఫ్ డిక్లరేషన్) గెజిట్‌ను కూడా పాస్ చేశారు. దీని రెండేళ్ల కాలపరిమితి ముగిసినా అధికారులు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయలేదు. దీన్ని మరో సంవత్సరం పొడిగించి రైతుల నుంచి ఎలాంటి సంతకాలు లేకుండా అవార్డుపాస్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 708.16 ఎకరాల్లో, ఎకరాకు 1.75 లక్షలుగా నిర్ణయించడంతో పాటు అన్ని పరిహారాల కింద రూ. 4.35 లక్షలను చెల్లించడానికి భూసేకరణ అధికారులు ఖరారు చేశారు. వీటికి సంబంధించిన రూ. 37 కోట్ల పరిహారం సొమ్మును రామగుండం ఐసీఐసీఐ బ్యాంక్‌లో డిపాజిట్ కూడా చేశారు. ఈ క్రమంలో భూసేకరణ చట్టం 2013 ప్రకారం రైతులు తమ భూములతో పాటు గ్రామాన్ని తీసుకోవాలని ప్రతిపాదనలు చేశారు. గ్రామస్థుల ప్రతిపాదనలకు సింగరేణి ససేమిరా అనడంతో పరిహారం అందుకునేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపలేదు.– గ్రామపంచాయతీ రికార్డుల సీజ్..ప్రాజెక్టు విస్తరణలో భాగంగా గ్రామాన్ని సైతం సేకరిస్తామని స్పష్టం చేస్తూనే... చేపడుతున్న భూసేకరణ సమయంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవద్దని సింగరేణి యాజమాన్యం అన్ని ప్రభుత్వశాఖలకు లేఖలు పంపింది. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గ్రామంలో నూతనంగా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా ముందస్తుగా గ్రామపంచాయతీ రికార్డులను సీజ్ చేశారు. దీంతో పదిహేడు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి నోచుకోవడం లేదు. 2017 సంవత్సరం వరకు రెవెన్యూ రికార్డుల్లో యాజమాన్యం హక్కులు కలిగిన రైతుల పేర్లను భూరికార్డుల శుద్ధీకరణలో భాగంగా తొలగించి సింగరేణి యాజమాన్యం పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. సింగరేణి భూసేకరణ స్పష్టత రాకపొవడంతో ఆ భూములను నేటికీ రైతులు సాగు చేసుకుంటున్నారు. కాగా గ్రామానికి సంబంధించిన 708.16 ఎకరాలు శుద్ధీకరణలో భాగంగా సింగరేణి యాజమాన్యపు హక్కును పొందడంతో ప్రభుత్వం కల్పించే పథకాలకు రైతులు అనర్హులయ్యారు. ప్రభుత్వం కల్పిస్తున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు రైతులకు అందడం లేదు. ప్రతి యేటా రైతులకు పెట్టుబడి సహాయం రూ.70.81 లక్షలను గ్రామా రైతులు కొల్పోతున్నారు. రైతులు చనిపోయిన కుటుంబాలకు రైతు బీమా అందడం లేదు. పాస్‌బుక్కులేని రైతులకు బ్యాంకులు వ్యవసాయ రుణాలు కల్పించడం లేదు.– అవార్డు క్యాన్సిల్‌కు హైకోర్టులో అప్పీల్.. బుధవారంపేట్ గ్రామంలో భూసేకరణ చేపట్టిన 708.16 ఎకరాల భూమి సేకరణకు సంబంధించిన సింగరేణి అవార్డును క్యాన్సిల్ చేయాలని గ్రామస్థులు 2017లో హైకోర్టు అప్పీల్ చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు కౌంటర్ పిటీషన్ దాఖలు చేయాలని సింగరేణికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం ఇటీవలే కౌంటర్ పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. –రైతుబంధు పథకం వర్తింపజేయాలి

# సూరీడు సుర్రు.. మీటరు గిర్రు

కొత్తగూడెం : పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కె.సత్యనారాయణ గృహ కనెక్షన్ బిల్లు 2022, ఏప్రిల్‌లో రూ.855 వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో బిల్లు రూ.959కి పెరిగింది. 2022, మేలో రూ.1,035 బిల్లు రాగా.. ఈ ఏడాది మే నెలలో రూ.1,365 బిల్లు వచ్చింది. రోజంతా కూలర్లు, ఏసీ వినియోగించడంతో బిల్లు పెరిగిందని సదరు వినియోగదారుడు పేర్కొంటున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఎస్.పద్మావతి నివాస కనెక్షన్‌కు గత సంవత్సరం మేలో రూ.820, ఈ ఏడాది అదే నెలలో ఏకంగా రూ.2,523 బిల్లు వచ్చింది. వేడి, ఉక్కపోత తాళలేక మూడు బెడ్‌రూంలలో ఉన్న మూడు ఏసీలనూ వినియోగించక తప్పని పరిస్థితి వచ్చిందని.. దీంతో బిల్లు అధికంగా నమోదైనట్లు ఆమె తెలిపారు. ఉభయ జిల్లాల్లో భానుడు ఠారెత్తిస్తున్నాడు. కొన్ని ప్రాంతాల్లో నిలకడగా 45 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెంలో 11 చోట్ల 45కి పైగా జూలూరుపాడు, పాల్వంచ మండలంలోని యానంబైలు, సీతారామపట్నంలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లాలో ఈ నెల 3న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో 5 గంటల వరకు నమోదైన పగటి ఉష్ణోగ్రతల ప్రకారం ఖమ్మం ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ 45.9, సత్తుపల్లి 45.5, ముదిగొండ 45.4, తిరుమలాయపాలెం, మధిర, మధిర మండలం సిరిపురం, కామేపల్లి మండలం లింగాల 45.1, కొణిజర్ల మండలం పెద్దగోపతి 45.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై రెడ్ జోన్ పరిధిలో చేరాయి. దీంతో వేడి, ఉక్కపోత ధాటికి గృహ విద్యుత్తు వినియోగం అంతకంతకూ పెరిగింది. మీటర్లు గిర్రుమంటుండగా, ఛార్జీలు మోతమోగిస్తున్నాయి. గత సంవత్సరం ఏప్రిల్, మే నెలలతో పోలిస్తే భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో వేసవి ఎండల ప్రభావం అధికంగా ఉంది. గ్రామాల్లో సైతం ఫ్యాన్లు, కూలర్లు నిరంతరం వినియోగిస్తున్నారు. పట్టణాల్లో ఏసీ ఉపశమనం పొందుతున్నారు. వ్యాపారులు దుకాణాలను ఉదయం, సాయంత్రం చల్లటి వాతావరణం ఉన్నంతసేపే తెరిచే పరిస్థితి నెలకొంది. గత వారం పదిరోజులుగా భానుడి ప్రతాపం జనజీవనాన్ని హడలెత్తిస్తోంది. మరికొద్దిరోజులు ఎండల ప్రభావం ఇలాగే కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించడంతో పాటు, బయటకు వెళ్లిన సమయాల్లో వడదెబ్బకు గురవకుండా చూసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఐటీఐల్లో ప్రవేశం.. ఉపాధికి ఊతం!

జనగామ : దేశ ఆర్థిక వ్యవస్థలో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందిస్తున్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఐటీఐల్లో చదివితే స్వయం ఉపాధితో పాటు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాలోని పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేందుకు ఐటీఐ విద్య దోహదపడుతోంది. జిల్లాలోనూ సాంకేతిక విద్యకు డిమాండ్ అధికంగా ఉంది. రెండేళ్ల ఐటీఐ కోర్సు పూర్తి చేసిన తరువాత అప్రెంటిస్ పూర్తి చేస్తే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. వీటిలో మొదటి విడత ప్రవేశాల కోసం జూన్ 10వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

భవితకు భరోసా..!

జనగామ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏడు ఐటీఐ కళాశాలలున్నాయి. జనగామలో 3, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో 2, పాలకుర్తిలో 1, బచ్చన్నపేటలో 1 ఉన్నాయి. 2023-24 విద్యాసంవత్సరానికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు (సాంకేతిక విద్యాశాఖ) అంతర్జాలం ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాలోని పలు ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, సివిల్, డీజిల్, మెషినింగ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్నింటికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆయా కోర్సుల వైపే మొగ్గు చూపుతుంటారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ ఏడాది కూడా జిల్లాలో పదో తరగతిలో చాలా మంది 10 జీపీఏ సాధించారు. దీంతో ఉన్నత విద్యకు ప్రామాణికమైన ఇంటర్‌లో చేరాలనుకునే వారు తరగతుల ప్రారంభం నాటికి ఐటీఐల్లో చేరుతుండడం గమనార్హం. ఐటీఐ ద్వారా ఉద్యోగావకాశాలు మెండుగా ఉండడంతో చాలామంది ఇందులో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు.

దరఖాస్తు విధానమిలా..



ఐటీఐలో ప్రవేశం కోసం %http://iti.telangana.gov.in% లో లాగిన్ కావాలి. కుడివైపున విద్యార్థి లాగిన్ ఓపెన్ చేయాలి. కొత్త రిజిస్ట్రేషన్ క్లిక్ చేసిన తరువాత చరవాణి నెంబర్, మెయిల్ ఐడీ నమోదు చేసి సబ్మిట్‌పై నొక్కాలి. చరవాణి నెంబర్‌కు యూజర్ నేమ్, పాస్‌వర్డ్ వస్తాయి. వాటి ఆధారంగా తెరచి వివరాలు నమోదు చేసుకోవాలి. పదో తరగతి, కుల ధ్రువీకరణపత్రం, ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివిన ఆయా పాఠశాలల బోనఫైడ్ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎక్కడెక్కడ ఐటీఐలు ఉన్నాయి.. అక్కడ ఏయే కోర్సులు ఉన్నాయన్న పూర్తి వివరాలను అంతర్జాలంలో పొందుపరిచారు. ఈ ఏడాది ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఐటీఐలో ప్రవేశాల వివరాలు తెలుసుకోవాలనుకునే వారు 98668 43920 నెంబర్‌లో సంప్రదించాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బి.హరికృష్ణ, జనగామ, యాదాద్రి జిల్లాల ఐటీఐ విభాగం కన్వీనర్

ఐటీఐలో ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐలో చేరి వెంటనే ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయి.

# ప్రవేశాల పెంపుపై దృష్టి



ఖమ్మం : ఉభయ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఈనెల 1న పునః ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇప్పుడిప్పుడే కళాశాలల బాట పడుతున్నారు. మొదటి సంవత్సరం ప్రవేశాలు మొదలైనప్పటికీ మందకొడిగా సాగుతున్నాయి. ప్రవేశాల సంఖ్య చాలా తక్కువ ఉంది. ఇంత వరకు ఊపందుకోలేదు. ఉభయ జిల్లాల్లో ప్రభుత్వ అనుబంధ యాజమాన్యాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు ఆదర్శ కళాశాలలు, కేజీబీవీల సంఖ్య ఎక్కువగా ఉండటంతో గ్రామీణ విద్యార్థులు వసతిగృహం అవకాశం ఉన్న కళాశాలల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు. శనివారం వరకు గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు అవకాశం ఉంది. తర్వాత అక్కడ ప్రవేశం లభించని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లాలో..

పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు ప్రవేశాల సంఖ్య పెంచేందుకు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విషయం గురించి ప్రచారం చేస్తున్నారు. ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు, ఎంసెట్ శిక్షణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ, విశాలమైన క్రీడా మైదానాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తదితర వాటి గురించి అవగాహన కల్పించటం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించుకునేందుకు యత్నిస్తున్నారు.

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణతో జోష్

ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించడంతో దాని ప్రభావం ఈసారి ప్రవేశాలపై పడేలా ఉంది. సర్వీసును క్రమబద్ధీకరించుకున్న అధ్యాపకులు ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ఉత్సాహంతో పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 132 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 118 మంది అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించిన విషయం తెలిసిందే.

అకాడమీలకు అనుమతి లేదు

జిల్లాలో అకాడమీలకు, ట్యూషన్ పాయింట్లకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేదు. ఇలాంటి సంస్థల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని చేర్పించి నష్టపోవద్దు. అఫిలియేషన్ ఉన్న కళాశాలల్లో మాత్రమే విద్యార్థులను చేర్పించాలి.కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఖమ్మం

# తెలిసినవాడే కాటేశాడు..



ఖమ్మం : ఎనిమిదేళ్ల బాలికపై 17 ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఏదులాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లోని సంచార జాతులకు చెందిన ఓ కుటుంబం ఏదులాపురంలో రోడ్డు పక్కనే డేరాలు వేసుకొని గ్యాస్ స్టవ్‌లు మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు, బిస్కెట్లు కొని ఇస్తానని చెప్పి అక్కడే డేరాలు వేసుకొని నివాసముంటున్న జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన బాలుడు(17) సమీపంలోని ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లాడు. కొంతకాలంగా ఒకే ప్రాంతంలో ఉంటుండటంతో తెలిసిన వ్యక్తే కదా అని బాలిక అతనితోపాటు వెళ్లింది. అతడు బాలికపై అఘాయిత్యానికి పాల్పడగా బాధితురాలు ఏడ్చుకుంటూ ఇంటికి చేరింది. విషయం తల్లికి చెప్పడంతో బాలికను చికిత్స నిమిత్తం ఖమ్మం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అత్యాచార ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

సర్వజనాసుపత్రి ఎదుట ఆందోళన అత్యవసర స్థితిలో ఆస్పత్రికి వస్తే వైద్యులు చికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ బాధితులు ఆందోళన బాట పట్టారు. ఏదులాపురంలో అత్యాచారానికి గురైన బాలికను తల్లిదండ్రులు ఖమ్మం సర్వజనాసుపత్రికి తీసుకొచ్చారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిని సంప్రదించగా పోలీసులు రాకుండా తాము చికిత్స అందించలేమని నిరాకరించారు. దీంతో కోపోద్రిక్తులైన చిన్నారి తల్లిదండ్రులు ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద రోడ్డుపై బైఠాయించారు. రహదారిపై వెళ్లే వాహనదారులు వారికి మద్దతుగా నిలవడంతో ఆందోళన పెద్దదైంది. బాలికకు రక్తస్రావం జరుగుతున్నా వైద్యులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా మానవత్వం చాటకుండా వైద్యులు నిబంధనల పేరుతో బయటకు పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. తర్వాత పోలీసులు వచ్చి బాధితులను సముదాయించి ఆస్పత్రి లోపలికి తీసుకెళ్లారు. ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్ పర్యవేక్షణలో బాలికకు వైద్యులు చికిత్స అందించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అత్యాచారం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆస్పత్రిలో ఓ ప్రత్యేక గదిలో ఉంచి వైద్య సేవలందిస్తున్నారు. ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ బాధ్యులు బాలికను పరామర్శించి ఘటనపై వివరాలు సేకరించారు.

# బడిలో చేరే రోజే పుస్తకాల పంపిణీ

వరంగల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటివరకు జిల్లా కేంద్రానికి ఒక లక్షా డెబ్బై వేల పుస్తకాలను పంపిణీ చేశారు కొన్నేళ్లుగా సర్కారు బడుల్లో చదివే పిల్లలకు సకాలంలో పుస్తకాలు అందకపోవడంతో ఆ ప్రభావం బోధనపై పడేది. ఈ మస్యను అధికమించాలని నిర్ణయించి రానున్న విద్యా సంవత్సరానికి బడిలో చేరిన రోజే పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యేక రిజిస్టర్లలో వివరాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పాఠ్యపుస్తకాల వివరాలను జిల్లా కేంద్రంలోని గోదాంలో ప్రత్యేక రిజిస్టర్లు ఏర్పాటు చేసి ఏ రోజు ఎన్ని పుస్తకాలు వచ్చాయో వివరాలను పొందుపరుస్తున్నారు. పుస్తకాలు భద్రపరిచే కేంద్రంలో నిత్యం నలుగురు సిబ్బంది 20 నుంచి 30 వేల పుస్తకాలను గదుల్లో భద్రపరుస్తున్నారు.

తెలుగు, ఆంగ్ల భాషల్లో..

కరోనాకు ముందు బడులు తెరిచే నాటికి పుస్తకాలు అందక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టారు. గత ఏడాది పుస్తకాల ముద్రణ ఆలస్యంగా ప్రారంభించడంతో జిల్లాకు సకాలంలో పుస్తకాలు చేరక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గతేడాది నవంబరు వరకు పుస్తకాల సరఫరా కొనసాగింది. పదో తరగతి ఫలితాలపై ప్రభావం చూపింది. ఈసారి యంత్రాంగం ముందుగానే పంపిణీకి తగు చర్యలు చేపట్టడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు కాస్త ఉపశమనం లభించనుంది.

పెరుగుతున్న ఆదరణ

నిరుపేదలు చదివే సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాలు నెలకొల్పి నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుండటంతో ఆదరణ పెరుగుతోంది. ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం, ఆత్మరక్షణ కోసం ప్రత్యేకంగా కరాటే తదితర కార్యక్రమాలు చేపడుతుండటంతో చాలా మంది తల్లిదండ్రులు, పిల్లలు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.



ద్విభాష.. క్యూఆర్ కోడ్

గతంలో పాఠ్య పుస్తకాలను ఒకే మాధ్యమంలో ముద్రించేవారు. ప్రస్తుతం పుస్తకంలో ఒకవైపు తెలుగు, మరో వైపు ఆంగ్లంలో ముద్రణ ఉంటుంది. తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్లంలో చదువుకోవడం పిల్లలకు సులభంగా ఉంటుంది. గత సంవత్సరం తొలిసారిగా 3 నుంచి 8 తరగతుల వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి వరకు అమలవుతోంది.

పక్కదారి పట్టకుండా..

ప్రభుత్వ బడుల్లో సరఫరా చేసే పుస్తకాలు పక్కదారి పట్టకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది ప్రైవేట్ మార్కెట్‌కు సరఫరా చేయకుండా ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం ప్రతి పుస్తకానికి వరుస సంఖ్య ముద్రించి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసింది. బహిరంగమార్కెట్లో అమ్మితే తెలిసే విధంగా ప్రభుత్వ స్టిక్కర్ అతికించింది. ఎవరైనా పుస్తకాలను అమ్మితే కఠినంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ప్రారంభం రోజునే పంపిణీ..

ఎండీ.అబ్దుల్ హై, డీఈవో


ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పాఠ్య పుస్తకాలు ముద్రించింది. జిల్లా కేంద్రానికి 67 శాతం పుస్తకాలు వచ్చాయి. వారంలోగా మిగితావి కూడా వస్తాయి. 14 మండల రిసోర్స్ కేంద్రాలకు వాటిని పంపిణీ చేశాం. అక్కడి నుంచి నేరుగా పాఠశాలలకు పంపిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు అందజేయాలని ఎంఈవోలకు సూచించాం. రాత పుస్తకాలను సైతం ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

# సైబర్, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

వరంగల్ : రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలతో పాటు మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో రెండు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో (టీఎస్‌న్యాబ్), తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ప్రత్యేక ఠాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు ప్రత్యేకంగా సైబర్ ఠాణా, నార్కోటిక్ బ్యూరో ద్వారా మరో ఠాణా ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటి ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి విధి విధానాలను రూపొందించాలని ఉన్నతాధికారులు సూచించారు. కొత్తగా ఏర్పాటయ్యే రెండు ఠాణాల నిర్వహణ ఏసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉంటుంది. దీనికి అవసరమైన సిబ్బందిని నియమించే అవకాశాలున్నాయి. దీనిపై కమిషనరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఠాణాల ఏర్పాటుకు స్థలాల అన్వేషణలో ఉన్నారు.

టీఎస్ న్యాబ్ ఠాణా ఏర్పాటైతే..

కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటయ్యే టీస్ న్యాబ్ ఠాణా ద్వారా మాదక ద్రవ్యాలను నిరోధించడంతో పాటు వాటికి సంబంధించిన కేసులను నమోదు చేస్తారు. ఈ ఠాణాలోని అధికారులు కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేస్తారు. దీంతో పాటు



మాదక ద్రవ్యాలపై నిఘా పెంచి అక్రమ రవాణాను అరికట్టడం సులభం అవుతుంది. ఏసీపీతో పాటుగా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్సైలు, 38 వరకు సిబ్బంది ఈ ఠాణాలో ఉంటారు.

సైబర్ ఠాణా ఏర్పాటైతే

ఇప్పటి వరకు సైబర్ నేరాలు జరిగితే 1930కు కాల్ చేస్తే వివరాలు సేకరించి సంబంధిత ఠాణా పరిధిలో కేసులను నమోదు చేసేందుకు సిఫార్సు చేసేవారు. లేదా నేరుగా శాంతి భద్రతల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కేసు నమోదు చేస్తున్నారు. దీనివల్ల కేసు విచారణలో జాప్యం జరగడంతో పాటు బాధితులకు డబ్బులు తిరిగి వచ్చేందుకు చాలా సమయం పట్టేది. సైబర్ ఠాణా ఏర్పాటైతే నేరుగా బాధితుడు ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు. లేదా 1930 నంబర్‌కు కాల్ చేసినా సైబర్ విభాగానికి సమాచారం అందడం, వెంటనే కేసు విచారణ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది. దీనికోసం ప్రత్యేకంగా నైపుణ్యం గల సిబ్బంది ఉండడంతో కేసు విచారణ త్వరితగతిన పూర్తవుతుంది. బాధితులకు సకాలంలో న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటంతో కేసులను త్వరితగతిన ఛేదించేందుకు అవకాశం ఉంటుంది. సైబర్ ఠాణాలో ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్సైలతో పాటు 40 మంది వరకు సిబ్బంది ఉంటారు.

# పట్టణ ప్రగతి నిధులు విడుదలయ్యేనా?

మహబూబాబాద్ : పురపాలక సంఘాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణ ప్రగతి పనులకు నిధులు నెలలు గడిచినా విడుదల కావడం లేదు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది పురపాలక సంఘాల్లో ఐదు నెలల నుంచి నిధులు రాకపోవడంతో.. ఆ నిధుల విడుదలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని పురపాలక సంఘాలు ఎదురు చూస్తున్నాయి. చేసిన పనుల బిల్లుల



కోసం వస్తున్న గుత్తేదారులకు సమాధానం చెప్పలేక అధికారులు సందిగ్ధంలో పడుతున్నారు. ప్రతిపాదించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుంటే, పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించనిదే పనులెలా చేయాలంటూ గుత్తేదారుల వాపోతున్నారు.

ఐదు నెలలు దాటినా..పట్టణాల్లో చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేసి ప్రతి నెలా బిల్లులు చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2020లో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. జనాభా ప్రాతిపదికన పురపాలక సంఘాలకు ఎన్ని నిధులు కేటాయించాలో ముందుగానే నిర్దేశించి ఆ మేరకు పనులను ప్రతిపాదించేవారు. పూర్తి చేసిన పనులకు వందశాతం నిధులు వెంటనే విడుదలయ్యేవి. 2021 ఆగస్టు నుంచి పట్టణ ప్రగతి నిధుల్లో సుమారు 25 శాతం నిధులకు కోత విధించింది. మిగిలిన 75 శాతం నిధులను కూడా క్రమం తప్పకుండా విడుదల చేయడం లేదు. ఐదు నెలలు దాటినా.. నేటికి నిధులు విడుదల చేయనట్లు తెలిసింది. 2022 నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన పట్టణ ప్రగతి నిధులను, 2022 సెప్టెంబర్, అక్టోబర్ నెలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను 2023 మార్చి 31న విడుదల చేసినట్లు సమాచారం. ఆ తర్వాత ఎలాంటి నిధులు విడుదల చేయలేదని తెలిసింది.

పనులు చేయిస్తున్నాంకె.ప్రసన్నరాణి, పురపాలక కమిషనర్

ప్రతి నెలా పట్టణ ప్రగతికి నిధులు మంజూరవుతాయనే ప్రణాళికాబద్ధంగా ఆ పథకం ద్వారా వివిధ పనులను చేయిస్తున్నాం. చేసిన పనుల వివరాలను బిల్లుల చెల్లింపునకు సంబంధిత అధికారులకు పంపించాం. ఈ పథకంలో చేపట్టే పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. వారిని ఒప్పించి పనులు చేయించాం. నిధుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు లేవు.

# నిఘా కొరవడి.. కోతలకు ఎగబడి



ఆదిలాబాద్ : శస్త్ర చికిత్స కాన్పుల వల్ల ఎన్నో దుష్పరిణామాలను మహిళలు ఎదుర్కోవాలి వస్తోందని భావించిన ప్రభుత్వం సాధారణ కాన్పులకే ప్రాధాన్యమివ్వాలని, సహజ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచిస్తోంది. ఈ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా పాలనాధికారులు, డీఎంహెచ్‌ఓలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని సూచిస్తున్నారు. ప్రతి వారం ఈ విషయమై హైదరాబాద్ స్థాయి నుంచి సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ సూచనలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే అమలవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మాత్రం పట్టించుకోవటం లేదు. 2021-22లో జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.10 శాతం సాధారణ ప్రసవాలు చేయగా ప్రైవేటులో 14.87 శాతం మాత్రమే చేశారు. 2022-23లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.73 శాతం సహజ కాన్పులు కాగా ప్రైవేటులో 14.58 శాతం మాత్రమే చేశారు.

మూలన పడ్డ ఈ-బర్త్ విధానం

ప్రభుత్వం రెండేళ్ల కిందట 'ఈ-బర్త్' విధానం రూపొందించింది. ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఈ విధానంలో ప్రభుత్వ/ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు చేసే స్కానింగ్ పరీక్షల వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉండేది. ఈ నివేదికల ఆధారంగా సదరు గర్భిణికి సాధారణ ప్రసవం చేయవచ్చా? శస్త్ర చికిత్స కాన్పు చేయాల్సి వస్తుందా? అనేది నిర్ధారణ చేసే వారు. కొన్ని సందర్భాల్లో ఆబార్షన్ చేయాల్సిన పరిస్థితి తలెత్తితే ఈ విధానం ద్వారా వివరాలు తెలిసేవి. ఈ ప్రక్రియను హైదరాబాద్ స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేవారు. కేవలం కొన్నాళ్లు మాత్రమే సాగిన ఈ విధానం ఆ తరువాత కుంటుపడింది. ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పూర్తిగా కొరవడింది. జిల్లా స్థాయి వైద్యాధికారులు దీనిపై పర్యవేక్షణను విస్మరించారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా కోతల ప్రసవాలు కానిస్తున్నారు. అత్యవసరమైతేనే శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నామని వాదించే ప్రైవేటు వైద్యులు సమస్యాత్మక కాన్పులను ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేసిన కేసులు సైతం అక్కడ సాధారణ ప్రసవాలవుతున్నాయి. మరి ప్రైవేటులో ఎందుకు సాధారణ కాన్పులు కావటం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు యాజమాన్యాలు శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి.

తనిఖీలు చేస్తేనే అక్రమాలు వెలుగుచూస్తాయి

ఇటీవల కరీంనగర్ జిల్లాలో ఒక ప్రైవేటు ఆసుపత్రి వారు గర్భిణికి శస్త్రచికిత్స కాన్పు చేసి సాధారణ ప్రసవం అయినట్లు నివేదికల్లో పొందుపరిచారు. వైద్యాధికారులు సదరు బాలింతకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటే ఆమెకు శస్త్ర చికిత్స కాన్పు చేసినట్లు బహిర్గతమైంది. ఈ విధానం జిల్లాలోనూ అమలు చేస్తూ, తరచూ ప్రైవేటు నర్సింగ్‌హోంలను తనిఖీ చేస్తే ఆ ఆసుపత్రుల్లో జరిగే అవకతవకలు వెలుగు చూసే అవకాశాలుంటాయి. కానీ అధికారులు ఈ దిశలో ప్రయత్నం చేయటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

ప్రైవేటులో 85 శాతానికి పైగా కోతలే..

రెండేళ్ల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10,952 ప్రసవాలు జరగగా వీటిలో 3,042(27.77శాతం) మాత్రమే శస్త్ర చికిత్స కాన్పులు జరిగాయి. ప్రైవేటులో 5,287 కాన్పులు కాగా 4,403(85.17శాతం) కోతకాన్పులు చేశారు. సంవత్సరాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

## సరిహద్దులు దాటుతున్న కల్తీ మద్యం.

కాగజ్‌నగర్ : గుజరాత్‌లో ఇటీవల కల్తీ మద్యం ఘటనలో 30 మందికి పైగానే ప్రాణాలు కోల్పోయారు. ఇంకా ఎంతో మంది అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మన దగ్గర జరుగుతున్న కల్తీ మద్యం దందాపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ధనార్జనే ధ్యేయంగా జిల్లాలో పలువురు దళారులు లైసెన్సు మద్యం దుకాణాల నుంచి మద్యం సీసాలను తీసుకొచ్చి కల్తీకి పాల్పడుతున్నారు. ఆ సీసాలను మహారాష్ట్ర సరిహద్దులోని మద్యం నిషేధం ఉన్న గడ్చిరోలి, వార్ధాలోని పలు ప్రాంతాలకు పెద్దమొత్తంలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొంత మంది మద్యం గొలుసు దుకాణాల్లో క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆబ్కారీ అధికారులు అడపాదడపా చేస్తున్న తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అరెస్టులతోనే సరిపెడుతుండటంతో దందాకు అడ్డుకట్ట పడటం లేదు. మహారాష్ట్రలో పలు జిల్లాలో నేటికీ మద్యనిషేధం అమలులో ఉంది. దీనిని ఆసరాగా తీసుకొని దళారులు మన రాష్ట్ర మద్యాన్ని కల్తీ చేసి గుట్టుచప్పుడు కాకుండా నిషేధం ఉన్న జిల్లాలకు తరలిస్తున్నారు. జిల్లాలో 32 మద్యం దుకాణాలుండగా, ఆ దుకాణాల నుంచే దళారులు కొనుగోలు చేసి కల్తీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆబ్కారీ, టాస్క్‌ఫోర్సు, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేయడంతో రెండేళ్ల వ్యవధిలో



జిల్లాలో మూడు కల్తీ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇంకా గుట్టుచప్పుడు కాకుండా ఎంతోమంది ఈ దందా చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆటాడుకుంటున్నారు. ప్రాణహిత నదిపై గూడెం వద్ద వంతెన పూర్తయ్యింది. దీంతో వంతెన అవతల వైపు మహారాష్ట్ర అహేరి, ఆళ్లపల్లి పట్టణాలతో పాటు, మద్యపానం నిషేధం ఉన్న జిల్లాలోని గడ్చిరోలి, వార్ధా ప్రాంతాలకు మద్యం రవాణా జరుగుతోంది.

ఈ నెల 23న కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలోని ఓ ఇంట్లో కల్తీ మద్యం సీసాలను ఆబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆ కల్తీ మద్యం సీసాలను గొలుసు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

నీళ్లు కలుపుతున్నారు..

2021 మార్చి 27వ తేదీన చింతలమానేపల్లి మండలం కోర్సిని ఓ ఇంట్లో కల్తీ మద్యం సీసాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ బ్రాండ్‌ల మద్యం సీసాల్లో కొంతమొత్తంలో నీరు కలిపి మహారాష్ట్రలోని వివిధ జిల్లాలకు తరలిస్తున్నట్టు టాస్క్‌ఫోర్సు విచారణలో తేలింది. మద్యం మూతలను తొలగించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన పరికరం వాడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కల్తీ జరుగుతున్న తీరు

వివిధ లైసెన్సు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో పనిచేసిన కార్మికులతోనే కల్తీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మద్యం దుకాణాల్లో పనిచేసిన పలువురు మద్యం సీసాల బిరడాలు, సీళ్లను ఏ మాత్రం చెడి పోకుండా తీయడం.. అందులోని మద్యాన్ని తొలగించి, నీరు పోసి మళ్లీ యథావిధిగా బిగించి సీజ్ చేస్తున్నారు. ఇంకో విధానంలో మద్యం దుకాణాలు, బార్లలోని ఖాళీ సీసాలను తీసుకువచ్చి.. వివిధ ప్రాంతాల నుంచి వివిధ కంపెనీల తాలుకూ నకిలీ బిరడాలను తెప్పించి, ఆ సీసాల్లో కల్తీ మద్యంనింపుతున్నట్లు సమాచారం. నిషేధిత ప్రాంతాలకు ఈ నకిలీ మద్యం సీసాలను తరలిస్తున్నందున మద్యం ప్రియులు అంతగా పట్టించుకోవడం లేదు. ఇటీవల పోలీసులు కల్తీ మద్యం స్వాధీనపర్చుకోగా, పలువురు వివిధ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేసిన వారే సూత్రధారులుగా తేలింది.

నిఘా పెంచుతాం..విలాస్‌కుమార్, ఆబ్కారీ సీఐ, కాగజ్‌నగర్

డివిజన్ పరిధిలోని కల్తీ మద్యం విక్రయాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం. సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచుతాం.

## ఆవుల పంపిణీలో అవకతవకలు

తిర్యాణి : భూమి లేని నిరుపేదలకు చేయూతనందించాలనే ఉద్దేశంతో పంపిణీ చేసిన ఆవులు బక్కచిక్కి చనిపోతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వందశాతం రాయితీపై అందించే వీటి కోసం కొందరు అధికారులు, దళారులతో కుమ్మక్కై మహారాష్ట్ర నుంచి నాసిరకం మూగజీవాలను రైతులకు అంటగట్టారు. దీంతో రోజురోజుకు ఎముకల గూడులా మారుతున్న గోమాతలను చూసి అన్నదాతలు కలవరపడుతున్నారు. ఐటీడీఏ నుంచి గిరి రైతులకు రెండేళ్ల క్రితం పంపిణీ చేసిన ఎడ్లు సైతం అనేక గ్రామాల్లో చనిపోయాయి. ఉచితంగా వస్తుండటంతో లబ్ధిదారులు సైతం గట్టిగా అడగలేని పరిస్థితి. దీంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అన్ని పథకాల్లో అందిన కాడికి దండుకుంటున్నారు.నాబార్డు ద్వారా జిల్లాలో అధికారులు వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తున్నారు. మామిడి, జామ తోటల పెంపకం, ఆవుల పంపిణీ, బావుల తవ్వకం, పైపులైన్లను రైతులకు అందించడం, కూరగాయల పంటలు, చిరుధాన్యాల సాగు, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం, తదిర వ్యవసాయ సంబంధమైన పనులు చేపడుతున్నారు. నిధులు ఖర్చవుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదని స్పష్టమవుతోంది. తిర్యాణి మండలంలో పంపిణీ చేసిన ఆవులను మహారాష్ట్ర నుంచి అధికారులు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇవి ఇక్కడి వాతావరణంలో ఇమడలేకపోతున్నాయి. బక్కచిక్కి ఉంటుండటంతో బీమా అధికారులు సైతం వెనకడుగు వేస్తున్నారు. అధికారులు మాత్రం ఒక్కో ఆవు కోసం రూ.40 వేల వరకు వెచ్చించినట్లు లెక్కలు చూపిస్తున్నారు.

అంతటా నామమాత్రం..

500 గిరిజన కుటుంబాలకు మామిడి, జామ మొక్కలు అందించారు. వీటిని 450 ఎకరాల్లో తిర్యాణి మండలంలోని 17 గ్రామాల్లో నాటామని చెబుతున్నారు. 35 మంది రైతులకు ఆవులను అందించారు. ఈ పనుల కోసం రూ.2.43 కోట్లు ఖర్చు చేశారు. సిర్పూర్(యు) మండలంలోని 16 గ్రామాల్లో 130 మంది లబ్ధిదారులకు మేకలు, కోళ్లు అందించారు. మరో 120 కుటుంబాలకు స్వయం ఉపాధి పథకాలు కేటాయించారు. ఇందుకు రూ.2.87 కోట్లు కేటాయించారు. వాటర్‌షెడ్ పథకంలో భాగంగా చిన్నపాటి కాలువలు ఉన్న ప్రాంతాల్లో నీటిని నిల్వ చేయడానికి కుంటలు, అడ్డుకట్టలు, రాళ్లకట్టలు నిర్మిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పనులన్నీ నామమాత్రంగా చేయడంతో ప్రస్తుతం అనేకచోట్ల కోతకు గురయ్యాయి. ఈ పనులకు సైతం రూ.కోటి వరకు కేటాయించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ మండలం కౌటగూడలో పనులు జరుగుతున్నాయి. కానీ సరైన పర్యవేక్షణ లేక లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఫలాలు అందడం లేదు.మొక్కుబడిగా పనులు..తిర్యాణి మండలంలోని వాడిగూడ సమీపంలో నిర్మించిన కుంట ఇది.

## తెరాసలో అసంతృప్తి రాగం...



ఆదిలాబాద్ : జిల్లా గులాబీ దళంలో మునుపెన్నడూ లేని విధంగా అసంతృప్తి రాజుకుంటోంది. నేతల మధ్య అంతరం పెరుగుతోంది. పునర్విభజన తరువాత ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతో పాటు ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన రెండు మండలాలు (ఉట్నూర్, ఇంద్రవెల్లి), ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన రెండు మండలాలు (నార్నూర్, గాదిగూడ)లతో నూతన జిల్లా అవతరించింది. రెండోసారి శాసనసభ ఎన్నికల అనంతరం నేతల మధ్య రాజకీయ వైరం పెరిగింది.

నువ్వా.. నేనా అన్నట్లుగా..బోథ్ నియోజకవర్గంలో సొంత పార్టీ నేతల్లోనే ఆధిపత్య పోరు స్పష్టంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే రాఠోడ్ బాపురావు వర్గానికి రాష్ట్ర డెయిరీ మాజీ ఛైర్మన్ లోకభూమారెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లతో కలిపి మాజీ ఎంపీ గోడం నగేష్ మరో వర్గంగా కొనసాగుతున్నారు. బోథ్ మండలంలో ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాల పరంపర మూడునెలల కిందటనే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని కుదిపేసింది. తాజాగా ప్రభుత్వం ఖరారుచేసిన కొత్తమండలాల జాబితాలో సొనాల ప్రస్తావన లేకపోవడంతో బోథ్ తెరాసలో మరోసారి అసంతృప్తి రాజుకుంది. ఎమ్మెల్యే బాపురావు అడ్డుకోవడంతోనే సొనాల మండలం ఏర్పాటు కాలేదని ఆయన వ్యతిరేక వర్గం ఆరోపిస్తోంది. సొనాల కేంద్రంగా నిరసనలు, వంటావార్పు, అక్టోబరు 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రకటించడం రాజకీయ వ్యూహంలోని భాగమేనని ఎమ్మెల్యేవర్గం పేర్కొంటోంది. తాజాగా గురువారం తుల శ్రీనివాస్ తనను కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే బాపురావు అనుచరుడైన నేరడిగొండకు చెందిన బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దావుల భోజన్న బోథ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయ వైరాన్ని బహిరంగపర్చింది. ఎంపీపీ తులశ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దావుల భోజన్న ఒకే పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నేతలైనా సఖ్యత చేకూర్చే ప్రయత్నం జరగడంలేదు.

సఖ్యత కరవు

ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేఖానాయక్, జడ్పీ ఛైర్మన్ జనార్దన్ రాఠోడ్ వర్గాల మధ్య సఖ్యత లేదు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్టే లక్ష్యంగా ఎవరి వర్గం వారిదన్నట్లుగా రాజకీయం నడిపిస్తుండటం పార్టీ శ్రేణులను ఇరకాటంలోకి నెడుతోంది. ఎవరితో సాన్నిహిత్యంగా ఉంటే ఏమవుతుందోననే ఆందోళన కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా పెంబి ఎంపీపీ కవిత భర్త గోవింద్‌కు ఎమ్మెల్యే రేఖానాయక్ మధ్య పెంబిలో చోటుచేసుకున్న గోడవ ప్రభావం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో అంతర్గత కనిపిస్తోంది. రాజకీయ పంతాన్ని నెగ్గించుకోవడానికి నేతలు చేస్తున్న ఎత్తుగడలు కార్యకర్తలకు ఇబ్బందులు తెచ్చిపెట్టేలా మారుతోంది. ఇటీవల భారీ వర్షాలతో అతలాకుతలమైన ఏజెన్సీ ప్రాంతాల్లో వేర్వేరుగా పర్యటించడం నేతల మధ్య దూరాన్ని వెల్లడిస్తోంది.అంతా బాగుంటుందనుకుంటున్న ఆదిలాబాద్ నియోజకవర్గంలో చాపకింద నీరులా అసమ్మతి రాజుకుంటోంది. డీసీసీబీ ఎన్నికల వరకు అత్యంత సన్నిహిత మిత్రులుగా పేరున్న ఎమ్మెల్యే జోగు రామన్న - బోథ్ ఎమ్మెల్యే రాఠోడ్ బాపురావు మధ్య ఇప్పుడు అంతరం పెరిగింది. బాపురావు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో సన్నిహితంగా మెలుగుతుండటం రామన్న వర్గం జీర్ణించుకోలేకపోతోంది. అదే సమయంలో తనను లక్ష్యంగా చేసుకున్న గోడం నగేష్, లోక భూమారెడ్డి, తుల శ్రీనివాస్‌ని జోగు రామన్న వెనకేసుకొస్తున్నారనేది బాపురావు వర్గం నుంచి వినిపిస్తోంది. అవకాశం చిక్కినప్పుడల్లా ఎవరికివారు అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదులు చేసుకునే దాకా వెళ్తోంది. జోగు రామన్న జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత శ్రేణుల మధ్య సఖ్యత కుదిర్చే ప్రయత్నం చేయకపోవడం అసంతృప్తికి మరింత ఆజ్యం పోసినట్లవుతోంది.

## నిర్లక్ష్యమా.. పనిభారమా?

మంచిర్యాల : రెండు నెలలుగా ఎంసీహెచ్‌లో ఒకే సమస్య వేధిస్తోంది. బాలింతలకు వేసిన కుట్లు ఊడిపోవడం, ఇబ్బందిగా మారడం. దీంతో బాధిత బంధువులు ఆందోళన చేపట్టడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం కొన్నిరోజులుగా జరుగుతూనే ఉంది. దాదాపు ఇప్పటి వరకు 40 మందికి పైగా ఇలాంటి సమస్యలు ఎదురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎప్పుడో ఒకసారి ఎదురయ్యే ఇలాంటి ఘటనలు ప్రస్తుతం పదే పదే జరగడం, గడిచిన రెండునెలల్లో అధికంగా ఉండటంపై బాధితుల బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చింది.

సమస్య ఎక్కడుంది..?

శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలకు ఇన్‌ఫెక్షన్ ఏ రకంగా వస్తుందో అర్థం కాకుండా ఉంది. కుట్లు వేయడంలో ప్రసూతి వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారా..? సిబ్బంది బాధితులకు సక్రమంగా డ్రెస్సింగ్ చేయడం లేదా..? బాధితురాలిని ఇష్టారీతిన కుటుంబ సభ్యులు చుట్టుముట్టడంతో తలెత్తుందా..? ప్రస్తుతం తీవ్ర వైద్యుల కొరత ఉండటంతో ఇప్పుడున్న వారిపై తీవ్ర భారం పడుతుండటంతో వస్తుందా.. అనేది తెలియకుండా ఉంది. ఇక్కడి పరిస్థితి చూస్తే వైద్యురాళ్లు ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపిస్తోంది. పనిభారం ఎక్కువ కావడంతోనే ఇలాంటి సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో రోజురోజుకి ప్రసవాల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు. కానీ సిబ్బంది మాత్రం పెరగడంలేదు.

అనుమతి ఉన్నా నియామకం చేపట్టడం లేదు

ఎంసీహెచ్‌లో వైద్యురాళ్ల నియామకానికి అవకాశమున్నా ప్రభుత్వం చొరవ చూపడం లేదని తెలుస్తోంది. ఎంసీహెచ్‌కు సంబంధించి పది పడకలతో కూడిన ఐసీయూకే ఇద్దరు ప్రసూతి, నలుగురు ఎంబీబీఎస్ వైద్యులు ఉండాలనే నిబంధన ఉందని సమాచారం. అలాంటిది వందపడకల ఆసుపత్రికి ఎంతమంది ఉండాలి..? కానీ మొత్తం కలిపి నలుగురితో నెట్టుకొస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో శస్త్రచికిత్స జరిగే ఇక్కడి కేంద్రంలో కనీసం పదిమంది అయినా లేకపోతే సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడంలేదు. వీరికి తోడు ఎంబీబీఎస్ మహిళా వైద్యుల నియామకం చేపడితే ప్రసూతి వైద్యురాళ్లకు తోడ్పాటు అందించే అవకాశం ఉంటుంది. దీంతో పనిభారం తగ్గి బాధితులకు మెరుగైన వైద్యం అందుతుంది.

ఇతని పేరు కుమారస్వామి. ఈయన సతీమణి గర్భిణి కావడంతో చికిత్స కోసం మూడు రోజుల కిందట మంచిర్యాల జీజీహెచ్‌కు వచ్చారు. ఇక్కడి ఓ వైద్యురాలు, సిబ్బంది శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేశారు. కానీ ఓటీ గదిలోనే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ప్రసవం తర్వాత చాలాసేపటి వరకు కుట్లు వేయకుండా కాలక్షేపం చేసినట్లు సాధారణ వార్డుకు వచ్చిన తర్వాత తన భార్య ఆవేదనతో చెప్పినట్లు ఆయన చెబుతున్నారు.

సమస్యకు.. అందరిదీ బాధ్యతే

మంచిర్యాల సిటీ: ఇటీవల కుట్లు ఊడిపోవడం, బాలింతలకు తరచూ ఇబ్బందులు కలుగుతుండటంపై ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సుమారు 50 మందికి పైగా ఈ సమస్య తలెత్తడంతో విచారణ చేయించాలని జీజీహెచ్ పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి పాలనాధికారితో పాటు డీఎంఈకి విన్నవించారు. గురువారం సంబంధిత సమస్యపై వివరాలు తెలుసుకునేందుకు హైదరాబాద్ నుంచి ఇద్దరు ప్రసూతి విభాగానికి చెందిన ప్రొఫెసర్ సునీత, అసోసియేటెడ్ ప్రొఫెసర్ నిర్మల వచ్చి ఇక్కడి ఆసుపత్రిలో పర్యటించి సమస్యకు గల కారణాల తెలుసుకున్నారు. ఆయా రిపోర్ట్ పత్రాలను శుక్రవారం అందజేసినట్లు తెలిసింది. బాధితులకు అందించిన చికిత్స వివరాలు తెలుసుకుని ప్రధానంగా కుట్లు వేసిన పద్ధతిని పరిశీలించినట్లు సమాచారం. ఇన్‌ఫెక్షన్స్ ఎందుకు వస్తున్నాయనే అంశంపైనే ప్రత్యేక దృష్టిసారించి వివరాలు ఆ రిపోర్ట్ పత్రంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఇబ్బందికి వైద్యులతో పాటు బాధిత బంధువులు, ఓటీ(ఆపరేషన్ థియేటర్)లోని పరికరాలు, బాలింతలు ధరించే దుస్తులు ఇలా అనేక కారణాలు ఉన్నాయని, దీనికి అందరూ బాధ్యులేనని అందులో తెలిపినట్లు సమాచారం.

## మొరాయిస్తున్న పాలేరు గేట్లు

ఖమ్మం : పాలేరు జలాశయం ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్లు మొరాయిస్తున్నాయి.. వరదొచ్చినా వాటంతట అవే వాలడం లేదు.. వరద తగ్గుముఖం పట్టి ఒత్తిడి తగ్గినా స్వతహాగా లేవడం లేదు. దీంతో ఇటీవలే వచ్చిన వరదల సమయంలో పాలేరు, నాయకన్‌గూడెం, కొత్తూరు, నర్సింహులగూడెం తదితర గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయానికి వరద పోటెత్తినపుడు గేట్లు ఎత్తే సమయంలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆటో మేటిక్‌ఫాలింగ్ ఆరు గేట్లు ఏర్పాటు చేశారు. ఇవి శిథిలావస్థకు చేరాయన్న భావనతో 2012లో కొత్తగా 24 కొత్త గేట్లను ఏర్పాటు చేశారు.

గేట్లు ఏర్పాటు చేసిన రెండేళ్ల వరకు జలాశయానికి పెద్దగా వరదలు రాకపోవడంతో వీటి పనితీరు గుర్తించలేకపోయారు. జలాశయానికి భారీగా వరద వస్తున్న సమయంలో గేట్లు వాటంతట అవే వాలిపోవాల్సి ఉండగా ఆ విధంగా జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది జాకీల సాయంతో గేట్లను తెరుస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల జలాశయానికి ఊహించని విధంగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ఒక్కసారిగా 35 వేల నుంచి 50 వేల



క్యూసెక్కుల వరద చేరే పరిస్థితి ఏర్పడటంతో అధికారులు, సిబ్బంది హైరానాపడ్డారు. హుటాహుటీన జాకీలు తెప్పించి గేట్లను పడేయాల్సిన(వాల్చడం) పరిస్థితి ఏర్పడింది. అర్ధరాత్రి వరకు కేవలం 11 గేట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగతా గేట్లల్లో ఆరు పూర్తిగా మొరాయించగా, 18 గేట్ల నుంచి మాత్రమే వరద ప్రవాహం కొనసాగింది. దీంతో జలాశయం నీటి మట్టం 25 అడుగులకు మించిన పరిస్థితి ఏర్పడింది.

ఆకృతి కారణమా? నిర్వహణ లోపమా?

జలాశయం గేట్లు ఆది నుంచే మొరాయిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. నిర్వహణ లోపం కారణంగా చెత్తా, ఇతర వ్యర్థాలు గేట్లల్లో కూరుకుపోవడంతో మొరాయిస్తుండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడం, ప్రత్యామ్నాయంగా విద్యుత్తు మోటార్లతో లేచే గేట్లను ఏర్పాటు చేయడంలాంటి అంశాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం నెలకొంది.

గేట్ల సమస్యను గుర్తించాం.. : సీఈ శంకర్‌నాయక్

పాలేరు జలాశయం ఫాలింగ్ గేట్లు మొరాయిస్తున్న విషయం వాస్తవమే. సిబ్బందితో జాకీలు ఏర్పాటు చేసి తగు ఏర్పాట్లు చేస్తున్నాం. గేట్ల ఏర్పాటు సమయంలో 'కౌంటర్ వెయిట్' సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం సమస్యగా గుర్తించాం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మరమ్మతులు చేపడతాం.

జలాశయం విశేషాలు..నిర్మాణం: 1924 విస్తీర్ణం: 4,444 ఎకరాలు నిల్వ సామర్థ్యం: 2.5 టీఎంసీలుఆయకట్టు సాగు: మాగాణి 2.50 లక్షల ఎకరాలు... మెట్ట 1.5 లక్షల ఎకరాలు

## మయూరి వంతెనకు మహర్దశ

ఖమ్మం : నగరవాసులకు ఆరు దశాబ్దాలుగా అత్యంత కీలకమైన సేవలందిస్తున్న మయూరిసెంటర్ ఆర్వోబీ పూర్వవైభవం సంతరించుకోనుంది. బలహీనంగా మారిన ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టనున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో వంతెన మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇటీవలే ర.భ.శాఖ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ గుత్తేదారు సంస్థకు మరమ్మతు పనులు అప్పగించారు.

పెచ్చులు ఊడిపోతూ ప్రమాదకరంగా..

ఇటీవల వంతెన స్లాబు పెచ్చులు ఊడిపోతూ ఇనుప చువ్వలు బయటపడుతున్నాయి. పిల్లర్లు, ఫుట్ పాత్‌లు బలహీనంగా మారాయి. సిమెంట్ కాంక్రీటు ఊడిపోతోంది. ఫుట్‌పాత్‌లపై రంధ్రాలు పడ్డాయి. ఇనుప చువ్వలు పైకి తేలాయి. వంతెనపై రోడ్డు భాగం, ఫుట్‌పాత్‌ల భాగం కొన్ని చోట్ల కలిసిపోయి కళావిహీనంగా మారింది. దీనిపై కొన్నాళ్లుగా భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. ఈ వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో ర.భ.శాఖ అధికారులు వంతెన తాజా పరిస్థితిని సాంకేతికంగా



నిపుణులతో తనిఖీ చేయించారు. మరమ్మతులు ఏవిధంగా చేపట్టాలో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా వంతెన మరమ్మతులకు రంగం సిద్ధమైంది.

రూ.3.50 కోట్లతో మరమ్మతులు

వంతెన పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.3.50 కోట్లు మంజూరు అయ్యాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన పరికరాలతో పిల్లర్లు(స్తంభాల)లో ఏర్పడిన ఖాళీ ప్రదేశాల్లోకి సిమెంట్‌ను పంపింగ్ చేస్తారు. అవసరమైన చోట ఇనుప చువ్వలు చొప్పించి వాటిని బలోపేతం చేయనున్నారు. స్లాబుల్లో తుప్పుపట్టి బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి చొప్పిస్తారు. గ్రౌటింగ్ పద్ధతిలో సిమెంట్ పేస్ట్‌ను స్లాబ్ కింది భాగంలో, స్తంభాలు, అప్రోచ్ గోడలపై బలోపేతం చేస్తారు. తిరుమల కొండపైకి వెళ్లే దారిలో కొండ చరియలు విరిగి పడకుండా ఇటీవల ఇనుప కమ్మీలు అడ్డుగా బిగించి గ్రౌటింగ్ చేశారు. అదే విధానాన్ని ఈ వంతెన బలోపేతానికి ఉపయోగించనున్నారు. ఫుట్‌పాత్‌లు సైతం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తారు.ఆర్వోబీ పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాం. మూడు నెలల్లో పూర్తి చేయాలని భావిస్తున్నాం. గుత్తేదారు సంస్థ వారు వచ్చి పనులు చేయాల్సిన ప్రదేశాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలతో చేయడం వల్ల వంతెన బలోపేతం అవుతుంది. కంభంపాటి శ్యాంప్రసాద్, ఖమ్మం ఈఈ, ర.భ.శాఖ



# సీఎం జగన్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం కలిశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగులకు సీఎం అండగా ఉంటానని స్పష్టం చేశారని తెలిపారు.

**కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం సంతోషకరం: బండి శ్రీనివాసరావు –** "12వ పీఆర్‌సీ ప్రకటించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఉద్యోగులకు కావాల్సిన రాయితీలను ప్రకటించారు. ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగస్వామ్యమేనన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం సంతోషకరం. చాలావరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించారు" అని బండి శ్రీనివాసరావు అన్నారు. 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రకటించినందుకు ధన్యవాదాలు. ?కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నా" అని బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

**సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలు సాహసోపేతం: శివారెడ్డి –** ఏపీఎన్జీవో కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ, పీఆర్‌సీ కమిషన్ వేసినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "టీడీపీ హయాంలో పీఆర్‌సీ కమిషన్ అడిగినందుకు గుర్రాలతో తొక్కించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఇచ్చిన మాటలను సీఎం జగన్ నిలబెట్టుకున్నారు. సీఎం జగన్ నిర్ణ యంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల 23 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. రెగ్యులర్ ఉద్యోగులకు బెనిఫిట్స్ వచ్చినట్టే కాంట్రాక్ట్ ఉద్యోగులకూ వస్తాయి. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలు సాహసోపేతమైనవి" అని శివారెడ్డి అన్నారు.

# సెల్ఫీలు దిగలేదని కోడిగుడ్లు విసురుతుంటే మాకేం? సంబంధం?: పేర్ని నాని




తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు అండగా నిలిచారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం, ఆశా ప్రజల్లో ఉంది అని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. కాగా, పేర్ని నాని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఏరోజూ మేనిఫెస్టోను పట్టించుకోలేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. వైద్యవిధాన పరిషత్‌లో సమస్యలు పరిష్కరించాం. సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడని ప్రజలు ఆశావహదృక్పథంతో ఉన్నారు. 99 శాతం హామీలను సీఎం జగన్ నెరవేర్చారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారు. కమిటీల పేరుతో కాలయాపన చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేశారు. ఉద్యోగుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకున్నది సీఎం జగనే. ఉద్యోగుల సమస్యలను మనసుతో ఆలోచించే వ్యక్తి సీఎం జగన్. నారా లోకేశ్ కనీసం ఒక పార్టీకి అధ్యక్షుడు కూడా కాదు. కనీసం ఎమ్మెల్యే కూడా కాదు. 10 మంది జనం కనబడగానే ఇష్టమొచ్చినట్టు మాట్లాడే వ్యక్తి లోకేశ్. ఓ మాజీ సీఎం కుమారుడికి ఇవ్వాల్సిన భద్రత కంటే ఎక్కువే ఇచ్చాం. మీ పార్టీ వాళ్లు కోడిగుడ్లు విసిరితే రక్షణ కరువవడం ఏంటి?. మీ పార్టీ కార్యకర్తలకు ముందు క్రమశిక్షణ నేర్పించండి. సెల్ఫీలు దిగలేదని కోడిగుడ్లు విసురుతుంటే మాకేం? సంబంధం?. ఉద్యోగులు ఉద్యమం చేయకుండా ఒక్క పీఆర్‌సీ అయినా అమలైందా?. ఉద్యోగులు రోడ్డెక్కకుండా 12వ పీఆర్‌సీని సీఎం జగన్ అమలు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చంద్రబాబు చెప్పారు అమలైందా? అని ప్రశ్నించారు.

# హనుమాయమ్మది ముమ్మాటికీ రాజకీయ హత్యే



ప్రకాశం: జిల్లాలోని టంగుటూరు మండలం రావివారిపాలెంలో అంగన్ వాడీ కార్యకర్త హనుమాయమ్మది ముమ్మాటికీ రాజకీయ హత్యే అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కక్ష్య కట్టి హనుమాయమ్మను అతి కిరాతకంగా చంపారని మండిపడ్డారు. రాజకీయ అండదండలతోనే ఇంటి ముందే కన్న కూతురి ముందు హత్య చేశారన్నారు. దళిత మహిళను చంపిన వ్యక్తి ఫోటోను కూడా పోలీసులు బయటపెట్టక పోవటం శోచనీయమని వ్యాఖ్యలు చేశారు. ఎస్పీ, హోం మంత్రి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి, మహిళ కమిషన్ చైర్ పర్సన్.. అందరూ మహిళలై ఉండి తోటి మహిళ హత్య పట్ల కనీస సానుభూతి చూపించటం లేదని టీడీపీ నేత అన్నారు. చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడమంటే తిట్ల దండకం అందుకుంటారన్నారు. జిల్లాకు చెందిన దళిత మంత్రి దళిత ఆడబిడ్డ హత్య చేయబడితే స్పందించలేదని విమర్శించారు. మంత్రి సురేష్ బయటకు వస్తే దళితులే చొక్కా చింపి కొడతారన్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రి మేరుగ నాగార్జున కూడా దళితుడై ఉండి సానుభూతి వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య చేస్తామని చెప్పి మరీ హనుమాయమ్మను హత్య చేశారన్నారు. ప్రభుత్వం హనుమాయమ్మ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ప్రకటించి.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ దళిత ద్రోహి అంటూ వంగలపూడి అనిత విరుచుకుపడ్డారు.

## టిడ్కో ఫ్లాట్ల ప్రారంభోత్సవం వాయిదాపై రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం

అమరావతి: గుడివాడలో టిడ్కో ఫ్లాట్ల ప్రారంభోత్సవం వాయిదాపై మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కొడాలి నాని, వైసీపీ ప్రభుత్వానికి వాళ్ళ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. నాలుగేళ్లుగా కళ్ళు కాయలు కాసెలా ఎదురుచూస్తున్న పేదలను ఇంత మోసం చేస్తారా అంటూ మండిపడ్డారు. చిటీ పాటల మాదిరి ఫ్లాట్ల ప్రారంభోత్సవాన్ని... ఒకటోసారి, రెండోసారి, మూడోసారి అంటూ వాయిదాలు వేస్తున్నారన్నారు. నేనెంత చెబితే జగన్‌కు అంతే అంటూ సొల్లు కబుర్లు చెప్పే కొడాలి నాని ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో 80 శాతం పూర్తి చేసిన ఇళ్లను ఇప్పటికీ ఇవ్వలేకపోతున్నారన్నారు. అధికారులు మోసపోవద్దని.. వ్యవస్థను అనుసరించాలని సూచించారు. చంద్రబాబు కష్టం, వెంకయ్య నాయుడు సహకారంతో ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసుకుందన్నారు. తమ కష్టం నాశనం అవుతుందని రోజు మొత్తుకుంటున్నప్పటికీ చివరికి జరిగిందేంటి అని నిలదీశారు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలన్నారు. 9 నెలలు ఓపిక పడితే, సీఎం హోదాలో చంద్రబాబు చేతుల మీదుగా ఫ్లాట్లను అప్పగిస్తామని రావి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు.

# మత్స్యకారుల చిరకాల స్వప్నం సాకారం

## ఇబ్రహీంపట్నంలో మత్స్య ఉత్పత్తుల విక్రయ దుకాణాల నిర్మాణాలకు శంకుస్థాపన

## భూమిపూజ చేసిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు



ఎన్టీఆర్ జిల్లా: ఇబ్రహీంపట్నం ఫెర్రీలో మత్స్యకారుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. వారి జీవనోపాధి పెంపొందించడానికి చర్యలు చేపట్టారు. గంగపుత్రుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించనుంది. మత్స్యకారుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా మత్స్య ఉత్పత్తుల విక్రయ దుకాణాల నిర్మాణాలకు మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాదు గారు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కృష్ణానదీ తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో పలు దుకాణాల నిర్మాణాలకు శాసనసభ్యులు కృష్ణప్రసాదు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ ..ఇక్కడ మత్స్యకారుల కోసం 45 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సబ్సిడీతో పాటు, రుణ సదుపాయాలు కల్పించి, కొంత లబ్దిదారుని వాటాతో ఇక్కడ దుకాణాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారికి కూడా అర్హతలను బట్టి దుకాణాలను కేటాయిస్తామన్నారు. ఇక్కడ స్థలాన్ని కేటాయించేందుకు చొరవ చూపిన కలెక్టర్ గారికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. నదిపై, అందులో లభించే మత్స్య ఉత్పత్తులపై ఆధారపడి జీవించే గంగపుత్రులకు నదిఒడ్డున నిర్మిస్తున్న ఈ దుకాణ సముదాయం ఎంతో ప్రయోజనంగా వుంటుందన్నారు. రెండు మాసాల వ్యవధిలో ఈ దుకాణ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి గారు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఒడిశా రైలు దుర్ఘటన

# మృతదేహాలను పెట్టిన స్కూల్ కూల్చివేత

బాలేశ్వర్: ఒడిశాలో మూడు రైళ్లు ఢీకొని వందల మంది ప్రాణాలు కోల్పోయిన ఘోర ప్రమాదం బాలేశ్వర్ ప్రజలకు ఇంకా కళ్లముందే కదలాడుతోంది. ఆ ప్రమాదానికి సంబంధించిన వార్తలు వింటేనే వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇక, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను బహానగా ప్రభుత్వ పాఠశాలలో భద్రపర్చారు. దీంతో ఇప్పుడు ఆ స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే అధికారులు ఆ పాఠశాల భవనాన్ని తాజాగా కూల్చేశారు. జూన్ 2వ తేదీన బాలేశ్వర్ లోని బహానగా రైల్వే స్టేషన్ సమీపంలో మూడు రైళ్లు ఢీకొన్న ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రమాదం గురించి తెలియగానే బహానగా వాసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రయాణికులను కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో 288 మంది దుర్మరణం చెందగా.. ఈ మృతదేహాలను తొలుత బహానగా హైస్కూల్‌కు తరలించారు. ఈ పాఠశాలను తాత్కాలిక శవాగారంగా మార్చారు. అనంతరం మృతదేహాలను ఇక్కడి నుంచి భువనేశ్వర్ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత స్కూల్‌ను శుభ్రం చేశారు. అయితే అనేక మృతదేహాలను ఒకే చోట చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో ఈ ప్రదేశానికి వచ్చేందుకు జంకుతున్నారు. ఈ స్కూల్‌ను జూన్ 16న తిరిగి తెరవనున్నారు. అయితే, పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు ధైర్యం చేయట్లేదని, వారి తల్లిదండ్రులు చిన్నారులను పంపించేందుకు నిరాకరిస్తున్నారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలా స్వేన్ తెలిపారు. మరోవైపు, 65 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం కూడా దెబ్బతిందని ఆమె అన్నారు. దీంతో ఈ స్కూల్ భవనాన్ని కూల్చాలని పాఠశాల యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలోనే బాలాసోర్ జిల్లా కలెక్టర్ దత్తాత్రేయ శిందే గురువారం స్కూల్‌కు వెళ్లి పరిశీలించారు. అనంతరం కూల్చివేతకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో ఈ భవనాన్ని శుక్రవారం కూల్చివేశారు. ఈ ప్రదేశంలోనే మరో కొత్త భవనాన్ని నిర్మిస్తామని, అప్పుడు విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా వస్తారని స్కూల్ యాజమాన్యం తెలిపింది.



## అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌పై

# మంగళవారం విచారణ

దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టనుంది. వివేకా హత్య కేసులో అవినాష్ ప్రధాన కుట్రదారు అని సునీత తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వం కూడా అవినాష్‌కే మద్దతిస్తోందని తెలిపారు. సీబీఐ విచారణను అడ్డుకుంటున్నారని చెప్పారు. మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగానే హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఏప్రిల్ 24 తర్వాత సీబీఐ నాలుగుసార్లు సమన్లు జారీ చేసిందని.. అవినాష్ ఒక్కసారి కూడా విచారణకు హాజరుకాలేదని సునీత న్యాయవాది పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో తెలంగాణ హైకోర్టు అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిలు పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలను విని గత నెల 31న తీర్పు వెలువరించింది. షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎనిమిదో నిందితుడిగా ఉన్న అవినాష్‌రెడ్డిని సీబీఐ ఇటీవల అరెస్ట్ చేసి, రూ.5 లక్షల చొప్పున రెండు పూచీకత్తులను తీసుకొని వెంటనే విడుదల చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



## నిరాడంబరంగా..

# నిర్మలమ్మ కుమార్తె కల్యాణం

దిల్లీ: రాజకీయ ప్రముఖుల ఇళ్లలో పెళ్లంటే మామూలుగా ఉండదు. భారీ సెట్టింగులు, కళ్లు మిరుమిట్లుగొలిపే బాణసంచాలు.. రకరకాల వంటకాలతో ధూం ధామ్ అనిపిస్తుంటారు. రాజకీయ ప్రముఖులు, అధికారుల రాకతో ఎటు చూసినా సందడి వాతావరణమే. కానీ, అందుకు భిన్నంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పరకాల ప్రభాకర్ దంపతులు తమ కుమార్తె వాఙ్మయి వివాహాన్ని అత్యంత నిరాడంబరంగా జరిపించి ప్రత్యేకంగా నిలిచారు. పరకాల వాఙ్మయి వివాహం ప్రతీక్‌తో గురువారం నిరాడంబరంగా జరిగింది. కేవలం కొద్ది మంది కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహ వేడుక జరిపించారు. రాజకీయ ప్రముఖులెవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఉడిపిలోని అదమరు మఠ్‌కు చెందిన పురోహితులు బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం వివాహ క్రతువు నిర్వహించారు. పెళ్లి సమాచారాన్ని సీతారామన్ కుటుంబసభ్యులు అధికారికంగా బయటకి వెల్లడించకున్నా.. వివాహ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# ముందస్తు బెయిల్ వస్తే నిర్దోషి అని అర్థం కాదు కదా!



అమరావతి: మాజీ మంత్రి వివేకా హత్య కేసు గురించి జగన్మోహన్ రెడ్డికి బయటి ప్రపంచానికంటే ముందే తెలుసని హైకోర్టులో సీబీఐ చెప్పినందుకు నైతిక బాధ్యతవహించి సీఎం వెంటనే రాజీనామా చేయాలని టీడీపీ నేత వర్ల రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వివేకా హత్య గురించి ముందే తెలిసిన జగన్ ఆ విషయం దాచిపెట్టడం ఈ కేసులోని కుట్రలో భాగమే అని ఆరోపించారు. ఆనాడు తెల్లవారుజామున తన ఓఎస్డీ కృష్ణమోహన్ ఫోన్‌కు అవినాశ్ రెడ్డి ఫోన్ చేసినట్టుగా సీబీఐ తెలియచేసిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి సీఎం తనపదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ కేసులో సీబీఐ పదేపదే ముఖ్యమంత్రి పేరు ప్రస్తావించడంపై ఆయన రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. హత్యకేసు వివరాలు జగన్‌కు ముందే తెలిసినా, ఆ నెపం చంద్రబాబుపైకి నెట్టడానికి ప్రయత్నించిన కారణాలను కూడా ప్రజలకు తెలియచేయాలని ఆయన అన్నారు.

## అమిత్ షా, చంద్రబాబు భేటీపై ఎంపీ సీఎం రమేష్ కీలక వ్యాఖ్యలు



విశాఖపట్నం: బీజేపీ పాత్ర ఉండే ప్రభుత్వం ఏపీలో త్వరలో వస్తుందని ఆ పార్టీ ఎంపీ సీఎం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. అమిత్ షా తో చాలా మంది నేతలు భేటీ అవుతారని.. అమిత్ షా, చంద్రబాబు భేటీపై ఇరువురు నేతలే చెబితే బాగుంటుందన్నారు. పొత్తులు గురించి కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పొత్తులపై సరైన సమయంలో సరైన నిర్ణయం కేంద్రం నాయకత్వం తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వమని అన్నారు.

ఈ నెల 11 విశాఖలో రైల్వే గ్రాండ్‌లో అమిత్ షా బహిరంగ సభ ఉంటుందని.. మోదీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలు అమిత్ షా వివరిస్తారని చెప్పారు. భారత్‌లో శరవేగంగా రోడ్లు, పోర్ట్, ఎయిర్ పోర్ట్ రైల్వే అభివృద్ధి చెందాయన్నారు. రేపు తిరుపతిలో బహిరంగ సభను నిర్వహిస్తున్నామని.. జేపీ నడ్డా ఈ సభలో పాల్గొంటారని అన్నారు. విశాఖలో అమిత్ షా బహిరంగ సభ పార్టీపరంగా జరుగుతుందన్నారు. విశాఖలో పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సభ.. జనసేనను పిలవలేదని ఎంపీ సీఎం రమేష్ పేర్కొన్నారు.

## జాన్వీ హెయిర్ స్టైల్ నయా ట్రెండ్!

ట్రెండ్ ని ఫాలో అవ్వడం కాదు..ట్రెండ్ ని సెట్ చేయాలి. రొటీన్ కి భిన్నంగా ఉన్నప్పుడే అలాంటివి సాధ్యం అవుతుంది. స్టార్ కిడ్ అతిలోక సుందరి ముద్దుల తనయ జాన్వీకపూర్ ఆ పనిలో ఉందనిపిస్తుంది. అవును జాన్వీ కపూర్ న్యూహెయిర్ స్టైలిష్ వీడియో ఒకటి ఇప్పుడు ఇన్ స్టాని షేక్ చేస్తోంది. ఫేమస్ హెయిర్ స్టైలిష్ అమిత్ ఠాకూర్ జాన్వీ హెయిర్ స్టైల్ ని కొత్త కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేసారు. దానికి సంబంధించిన వీడియో షూట్ ఒకటి ఇన్ స్టాలో వైరల్ గా మారింది. స్కిన్ టైట్ గోల్డ్ కలర్ డిజైనర్ దుస్తుల్లో జాన్వీ కెమారాకి ఫోజులిచ్చింది. ఇందులో అమ్మడి హెయిర్ స్టైల్ పైనే ఫోకస్ చేసినట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట



వైరల్ గా మారింది. ట్రెండ్ని ఫాలో అవ్వడంలో జాన్వీ ముందుంటుంది. ఎప్పటికప్పుడు న్యూ లుక్ లోఎలివేట్ అవ్వడానికి ఆసక్తి చూపిస్తుంది. విదేశీ మోడల్స్..ర్యాంప్ వాక్ భామల్లా ఇన్ స్టాలో వెలిగిపోతుంటుంది. క్యామ్ ముందు ఆవిష్కరించే అందాల ఆరబోత గురించైతే చెప్పాల్సిన పనిలేదు. మ్యాగజైన్ కవర్ పేజీలపై చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. గ్లామర్ షోలో తనదైన ముద్ర వేసి పోటీ ప్రపంచంలో దూసుకుపోతుంది. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో 'దోస్తానా-2' లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. 'మిలీ' అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది.

వచ్చే ఏడాది ఆ సినిమా రిలీజ్ కానుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్దంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఈ విషయంలో తండ్రీ బోనీకపూర్ వెనుకుండి ప్రోత్సహిస్తున్నారు. ఆయన అనుభవాలు అన్నింటిని రంగరించి జాన్వీ తెలివైన నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. తెలుగు సినిమా పాన్ ఇండియా కి రీచ్ అవ్వడంతో ఇక్కడ ప్రత్యేక శ్రద తీసుకునే ఛాన్స్ ఉంది. తల్లి తరహాలోనే జాన్వీ తెలుగు సినిమాపైనా తన ముద్ర వేయాలని ఉవ్విళ్లూరుతుంది.

## వెనక నుంచి పట్టుకున్నాడు.. యువ నటి కాస్టింగ్ కౌచ్ అనుభవాలు..!

మలయాళ యువ నటి మాళవిక శ్రీనాథ్ కాస్టింగ్ కౌచ్ పై చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ న్యూస్ గా మారాయి. కాస్టింగ్ కౌచ్ మీటూ పేరు ఏదైనా సినిమా పరిశ్రమలో హీరోయిన్ల పై జరుగుతున్న లైంగిక వేధింపుల గురించి బయట పెడుతూ వారిని ఇబ్బంది పెట్టిన వారిని టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్నేళ్ల క్రితం తమ పై జరిగిన లైంగిక దాడుల గురించి కూడా కథానాయికలు పెదవి విప్పారు. ఇక లేటెస్ట్ గా ఈ విషయం పై కామెంట్స్ చేసింది మాలవిక



శ్రీనాథ్. మలయాళంలో ఇప్పుడే నటిగా గుర్తింపు తెచ్చుకుంటున్న మాళవిక తన పై జరిగిన లైంగిక వేధింపులను బయట పెట్టింది. తనను ఆడిషన్ కు పిలిచిన వ్యక్తే తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. మలయాళంలో ఒక సినిమాలో మంజు వారియర్ కీలక పాత్ర పోషించగా అందులో ఆమె కూతురు పాత్ర కోసం ఆడిషన్ నిర్వహించారట. ఆ ఆడిషన్ లో ఒక వ్యక్తి తనని లైంగికంగా వేధించాడని మాళవిక రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆడిషన్ ని ఏర్పాటు చేసిన ఆ వ్యక్తే తన పై అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. ఆడిషన్ జరుగుతున్న టైం లో తన మదర్ సిస్టర్ బయట ఉన్నారని.. లోపల ఆడిషన్ చేసే వ్యక్తి తనని వెనక నుంచి వచ్చి పట్టుకున్నాడని.. తాను విడిపించుకునే ప్రయత్నం చేయగా సర్దుకుంటే ఆ పాత్ర నీకే దక్కుతుందని చెప్పారని చెప్పింది. అయితే అతని నుంచి ఎలాగైనా తప్పించుకునేందుకు అక్కడ ఉన్న కెమెరా కింద పడటంతో అతని దృష్టి దాని మీదకు వెళ్లింది అప్పుడు అక్కడ నుంచి తప్పించుకున్నానని చెప్పుకొచ్చింది మాళవిక. తనకు జరిగిన ఈ విషయం తనని చాలా భయపెట్టిందని అయితే అందరు అలా ఉండరని కానీ కొందరు మాత్రం ఇలాంటి పనుల వల్ల హీరోయిన్స్ కి ఇబ్బంది కలిగిస్తున్నారని చెప్పింది.




## జివ్వు మనిపిస్తోన్న జాన్వీ కపూర్!



అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ కపూర్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. బాలీవుడ్ లో ఇప్పటికే తనదైన మార్క్ వేసింది. నటిగా మరింత షైన్ అవుతూ కెరీర్ ని చక్కగా బిల్డ్ చేసుకుంటోంది. వెనుక తండ్రి బోనీకపూర్ ప్రోత్సాహం జాన్వీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తుంది. తల్లికి తగ్గ తనయురాలిగా అన్ని పరిశ్రమలో కుమార్తెకి ప్రత్యేకమైన ఐడెంటిటీ దిశగా ముందుకు తీసుకెళ్లాలన్నదే బోనీ ప్లాన్ గా కనిపిస్తోంది. ఇక జాన్వీ ఇన్ స్టాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. సమయం చిక్కినప్పుడల్లా ఇన్ స్టాని ఓ రేంజ్ లో తనదైన గ్లామ్ షోతో హీటెక్కించడం జాన్వీ ప్రత్యేకత. తాజాగా బ్యూటీ మరో హాట్ ఫోటోతో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. డెనిమ్ జీన్స్ దరించి..మ్యాచింగ్ వైట్ కలర్ స్కిన్ టైట్ బ్లౌజ్ లో కాకలు పుట్టిస్తోంది. చారడేసి కళ్లకు ఐటెక్స్ అద్దింది. మత్తెక్కించే చూపులతో కుర్రాళ్ల హృదయాల్నే కొల్లగొడుతోంది. ఉదయించే సూర్యుడి సైతం జాన్వీపైనే ఫోకస్ పెట్టాడు. ఎర్రటి రవి కిరణాల నడుమ జాన్వీ మరింత ప్రకాశవంతంగా ధగధగలాడుతోంది. సరిగ్గా బీచ్ ఒడ్డున ఇలా జాన్వీ కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. జాన్వీ పిక్ ని ఉద్దేశించి నెటి జనులు ఫైరింగ్ ఎమోజీలను పోస్ట్ చేస్తున్నారు. ఇన్ స్టాలో ఇలాంటి ఎలివేషన్స్ ఇవ్వడం జాన్వీకి కొత్తేం కాదు. ఫాలోవర్స్ సంఖ్యని పెంచుకోవడం కోసం బ్యూటీ ఇన్ స్టాని ఎప్పటికప్పుడు షేక్ చేస్తూనే ఉంటుంది. జిమ్..యోగా సెషన్స్ కి సంబంధించిన ఫోటోలు..వీడియోలు సోషల్ మీడియాలో తరుచూ వైరల్ అవుతుంటాయి. ఇన్ స్టా ఖాతాని మెయింటైన్ చేసేందుకు ప్రత్యేకమైన ఓ టీమ్ నే ఏర్పాటు చేసుకుంది. జాన్వీ అప్ డేట్స్ అన్ని వాళ్లే చూసుకుంటారు. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే నటిగా బిజీగా ఉంది. ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో దోస్తానా-2 లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన గుడ్ లక్ జెర్రీ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. మిలీ అనే మరో చిత్రంలో కూడా నటి స్తుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. కానీ సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

## ఇద్దరు భామలతో మెగాస్టార్ దద్దరిల్లే డ్యాన్స్



మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని కుర్ర హీరోలందరికీ తన చరిష్మా ఏమాత్రం తగ్గలేదని మీ అందరికీ పోటీగా నేనుంటానని వార్నింగ్ ఇచ్చినట్టు అయింది. ఇక ఈ సినిమా తర్వాత ఆయన చేస్తున్న దాదాపు అన్ని సినిమాల మీద ఆసక్తి ఏర్పడుతుంది. ఇక ఆయనతో సినిమాలు చేస్తున్న దర్శక నిర్మాతలు సైతం కాస్త బడ్జెట్ పెంచిన పర్వాలేదు ఆ బడ్జెట్ పెంచిన మేరకు వసూళ్లు రాబట్టుకున్నామని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతానికి మెగాస్టార్ చిరంజీవి మెహర్ రమేష్ దర్శకత్వంలో ఒక మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ లో నటిస్తున్నారు. ఆ సినిమాకి భోళా శంకర్ అనే టైటిల్ ఫిక్స్ చేశారు. తమిళంలో అజిత్ కుమార్ నటించిన వేదాళం సినిమాకు ఇది రిమేక్ గా తెరకెక్కుతుంది. సూపర్ హిట్ గా నిలిచిన అజిత్ సినిమాని ఇప్పుడు తెలుగులో భోళా శంకర్ పేరుతో రీమేక్ చేస్తున్నారు. ఆగస్టు 11వ తేదీన ఈ సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్ ప్రారంభించింది సినిమా యూనిట్. మరో పక్క సినిమా ప్రొడక్షన్ కూడా చివరి దశలో ఉంది. ప్రస్తుతానికి ఈ సినిమా యూనిట్ చిరంజీవి తమన్నా ఇద్దరి మీద ఒక మంచి మాస్ సాంగ్ షూట్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ సాంగ్ లో తమన్నా భాటియాతో పాటు కీర్తి సురేష్ కూడా కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఈ సాంగ్ కి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఇక ఈ పాటకు తమన్నా కీర్తి సురేష్ మెగాస్టార్ చిరంజీవి ముగ్గురు కలిసి కాలు కదపబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఇప్పటికే ఈ మధ్యనే సినిమా ప్రమోషన్స్ ప్రారంభించిన సినిమా యూనిట్ భోళా మేనియా పేరుతో మొదటి పాట విడుదల చేసింది. స్వర సాగర్ మహతీ అందించిన ఈ పాట మంచి మ్యూజికల్ హిట్టుగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ సినిమాని అనిల్ సుంకర ఏకే ఎంటర్టైన్మెంట్స్ మీద భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలు అయితే నెలకొన్నాయి.

## ఆ స్టార్ హీరోని 'ఆంటీ' అని పిలుస్తా: పూజా హెగ్డే

టాలీవుడ్లో ఉన్న మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లో పూజా హెగ్డే ఒకరు. కెరీర్ స్టార్టింగ్లో వరుస ఫ్లాపులు ఎదురైనా.. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'దువ్వాడ జగన్నాథం'తో సక్సెస్ ట్రాక్ ఎక్కింది. ఆ తర్వాత వరుస ఆఫర్లను అందుకోవడంతో పాటు వరుస హిట్లనూ ఖాతాలో వేసుకుని స్టార్ స్టేటస్ను దక్కించుకుంది. ఇక చివరిగా ఈ బుట్టబొమ్మ 'రాధేశ్యామ్'తో ప్రేక్షకులను పలకరించింది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ వింటేజ్ ప్రేమ కథా చిత్రం మార్చి 11న విడుదలై నెగిటివ్ టాక్ సొంతం చేసుకుంది. గత కొంత కాలం నుంచి వరుస విజయాలతో దూసుకుపోతున్న పూజాకు 'రాధేశ్యామ్' రూపంలో బిగ్



ఫ్లాప్ పడింది. ఇదిలా ఉంటే.. ఇప్పుడీమె నటించిన మరో పెద్ద సినిమా రిలీజ్కు సిద్ధం అవుతోంది. అదే 'సర్కస్'. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందిన కామెడి ఎంటర్టైనర్ చిత్రమిది. ఇందులో పూజా హెగ్డే జాక్వెలిన్ హీరోయిన్లుగా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా హెగ్డే.. వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత విషయాలనూ షేర్ చేసుకుంది. అలాగే రణవీర్ సింగ్ను 'అంటీ' అని పిలుస్తా అంటూ సీక్రెట్ కూడా రివీల్ చేసింది. పూజా మాట్లాడుతూ.. 'సెట్స్లో రణవీర్ సింగ్ ఉంటే ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. తనని నేను 'పమ్మీ ఆంటీ' అని పిలుస్తాను. ఎందుకంటే పరిస్థితులు ఎంత గంభీరంగా ఉన్నా సరే అతను తనదైన పంచ్లతో నవ్వుల్ని పంచుతాడు. రణవీర్ ఎక్కడ ఉంటే అక్కడంతా సందడి వాతావరణం ఏర్పడుతుంది' అంటూ చెప్పుకొచ్చింది. అలాగే సర్కస్ సినిమా మంచి విజయం సాధిస్తుందని.. ఇందులో తమ జంట ఎంతో చూడముచ్చటగా కనిపిస్తుందని కూడా ఆమె పేర్కొంది. కాగా పూజా హెగ్డే ఇతర ప్రాజెక్ట్ల విషయానికి వస్తే.. ఈమె నటించిన 'ఆచార్య' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో తెరకెక్కనున్న చిత్రంలోనూ పూజా హీరోయిన్గా ఫిక్సైంది. తమిళంలో దళపతి విజయ్తో ఈమె చేసిన 'బీస్ట్' త్వరలోనే విడుదల కానుంది.

## మెగా నిహారిక.. ఈ రేంజ్ గ్లామర్ ఊహించలేదు

కొణిదెల నాగబాబు కూతురిగా చిరంజీవి పవన్ కల్యాణ్ ల అల్లరి కూతురిగా.. మెగా డాటర్ గా మంచి పేరునే సంపాదించుకుంది. ముందుగా టీవీలో యాంకర్ గా కెరియర్ ప్రారంభించిన ఈ క్యూట్ బ్యూటీ ఆ తర్వాత సినిమాల్లో వెబ్ సిరీస్ లలో నటించి మెప్పించింది. ఒక మనసు చిత్రంతో సినిమాల్లోకి వచ్చిన ఈమె ఆ తర్వాత పలు సినిమాల్లోనూ కనిపించింది. తన అందం అభినయంతో ఎంతో కొంత ఫాలోవర్స్ ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా ముద్దపప్పు ఆవకాయ్ వెబ్ సిరీస్ తో విపరీతమైన క్రేజ్ ను దక్కించుకుంది. కేవలం సినిమాల్లో నటిగానే కాకుండా నిర్మాతగా కూడా మారి తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటుంది. 2020 డిసెంబర్ 9వ తేదీన జొన్నలగడ్డ చైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుందీ ముద్దుగుమ్మ. ఆ తర్వాత కూడా వరస సినిమాలు వెబ్ సిరీస్ లు చేస్తూ బిజీగా గడుపుతోంది. ఈ క్యూట్ బ్యూటీ ఎంత బిజీగా ఉన్నా



తనకు సంబంధించిన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను సోషల్ మీడియా వేదికగా అందరితో పంచుకుంటుంది. అయితే తాజాగా నిహారిక ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో అదిరిపోయే ఔట్ పిట్ లో దర్శనం ఇస్తూ... కుర్రకారులో హీటు పుట్టిస్తోంది. డెనిమ్ వేర్ డ్రెస్ వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. చాలా హాట్ అంట్ స్ట్రెయిట్ లుక్ తో మరింత రచ్చ చేస్తోందీ ముద్దుగుమ్మ. ట్ర యాంగిల్ షేప్ లో ఉన్న వైట్ కలర్ ఇయర్ రింగ్స్ పెట్టుకొని.. మత్తెక్కించే కళ్లతోనే మాయ చేస్తోంది. ఈమె ఫొటోలు చూసిన నెటిజెన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నాయి. నిహారిక ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే వేలల్లో లైకులు వందల్లో కామెంట్లు వచ్చాయి. చాలా అందంగా ఉన్నావు అదిరిపోయావు హేయ్ బ్యూటిఫుల్ అంత క్యూట్ అండ్ హాట్ గా ఎలా ఉన్నావంటూ పలువురు కామెంట్లు చేశారు. ఐ లవ్ నిహా బంగారం అంటూ ఓ నెటిజెన్ తన మనుసులోని భావాన్ని కామెంట్లు రూపంలో వెల్లడించారు. ఒక్కగానొక్క మెగా హీరోయిన్.. మామూలుగా లేదుగా అంటూ ఓ నెటిజెన్ కామెంట్ చేశాడు.



## ప్రసాదం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ చేప మందు అందిస్తాం: మంత్రి తలసాని

హైదరాబాద్: చేప ప్రసాదం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ చేప మందు అందిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మృగశిర కార్తె రోజున చేప తినాలి అనే ఒక ఆనవాయితీ ఉందని చెప్పారు. చేప మందు పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీని మంత్రి తలసాని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చేప ప్రసాదం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే లక్షలాది మంది ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బత్తిన హరినాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు ఇచ్చే చేప ప్రసాదంపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. కరోనా కారణంగా మూడేండ్లపాటు పాటు చేప ప్రసాదం పంపిణీ చేయలేదన్నారు. శుక్ర, శనివారాల్లో చేప మందును అందించనున్న నేపథ్యంలో ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.5 లక్షల కొర్రమీను చేపలను అందుబాటులో ఉంచారు. అదనంగా మరో 75 వేల చేప పిల్లలతోపాటు.. అవసరమైతే మన్ని చేప పిల్లలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, చేప మందుకోసం గురువారం నుంచే దేశం నలుమూలల నుంచి ప్రజలు నగరానికి తరలివస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వంటి అనేక ప్రాంతాల నుంచి వ్యాధిగ్రస్తులు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. మొత్తం 32 క్యూలైన్ల ద్వారా ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. నాంపల్లి గ్రౌండ్ పరిసరాల్లో 700 వరకు సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండు రోజులపాటు దాదాపు 300 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 10వ తేదీవరకు నగరంలోని సికింద్రాబాద్ స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వంటి ప్రాంతాల నుంచి దాదాపు 50 బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే మరో 14 ప్రాంతాల నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు 80 బస్సులను నడుపుతున్నారు.



## ఆస్ట్రేలియాలో కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్..పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి లక్ష్యాలను, ముఖ్యమంత్రి కేసీఆర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నీని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డిని ఆమె అభినందించారు. టోర్నమెంట్ నిర్వహణ వల్ల సీఎం కేసీఆర్ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే ఎజెండా ను ఎన్ఆర్ఐలందరికీ చేరుతుందని ఆమె పేర్కొన్నారు. నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రతీ గ్రామానికి స్టేడియం నిర్మించనున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావాన్ని భారతీయులకు, ఎన్ఆర్ఐలకు తెలిసేలా క్రికెట్ టోర్నీని ఎంచుకున్నామని వివరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బాబా ఫసియుద్దిన్ ,సేనాపతి రాజు, కళ్లెం హరికృష్ణ రెడ్డి, రమేష్ చారి, బీ ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని మంత్రి హరీశ్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ పాలన లో అత్తా కోడళ్ల పంచాయితీలు బందయ్యాయని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ఆత్మగౌరవం పెంచారని తెలిపారు. గాంధీ భవన్‌లో కూర్చుంటే కాంగ్రెస్ వాళ్లకు అర్థంకాదని, ఊర్లోకి వచ్చి అవ్వ, తాతలను అడిగితే తెలుస్తుందన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ ఉత్సవాలకు మంత్రి హరీశ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ లో తప్పా బీడీ కార్మికులకు ఏ రాష్ట్రంలోనైనా పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని చెప్పారు. పెద్ద కొడుకులా వృద్ధులకు పెన్షన్లు అందిస్తున్నారని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నిండాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 12 లక్షల 71 వేల మంది ఆడబిడ్డలకు మేనమామలా పెండ్లి చేశారని తెలిపారు.

తొమ్మిదేండ్లలో ఆసరా పెన్షన్ల కింద 59 వేల కోట్లు అందించామన్నారు. అన్ని కులాలకు సంక్షేమ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రెండు, మూడు రోజులకు ఒకసారి మంచి నీళ్లు వచ్చేవి, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షిత మంచి నీళ్లు ఇస్తున్నామని వెల్లడించారు. నేరుగా పొయ్యి దగ్గరకే తాగునీరు వస్తున్నదని స్పష్టం చేశారు.

**ఎడ్యుకేషన్ హబ్‌గా సిద్దిపేట..** సిద్దిపేటలో 12 రెసిడెన్షియల్ స్కూళు ఏర్పాటుచేశామన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ ఏర్పడిందన్నారు. సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని వెల్లడించారు. పట్టణంలోని కోమటి చెరువు సర్వాంగ సుందరంగా తయారైందని, చెరువ వద్ద త్వరలో డైనోసర్ పార్క్‌ను ఏర్పాటుచేస్తామన్నారు.

**బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా? :** ప్రభుత్వ దవాఖానల్లో 33 వేల పడకలు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేశామని తెలిపారు. వైద్య కళాశాలలు తెచ్చామని బీజేపీ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకుల తీరు సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది అన్నట్లు ఉందని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా అని ప్రశ్నించారు. అబద్ధాల బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలను అమలు చేయాలన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులవి నరం లేని నాలుకలని విమర్శించారు.




హైదరాబాద్ : శంషాబాద్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వ్యక్తి.. ఆమెను దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన వెంకట సాయికృష్ణ, అప్సర బంధువులు. సాయికృష్ణకు ఇప్పటికే వివాహమై.. ఇద్దరు పిల్లలున్నారు. అయితే.. అప్సరతో సాయికృష్ణ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని అప్సర అతడిపై ఒత్తిడి తీసుకువచ్చింది. అయితే.. వీరిద్దరూ రెండ్రోజుల కిందట కారులో శంషాబాద్‌లోని సుల్తాన్‌పల్లికి వెళ్లారు. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన సాయికృష్ణ.. ఆమె తలపై బండరాయితో మోది హత్య చేశాడు. అనంతరం తన కారులోనే ఆమె మృతదేహాన్ని సరూర్‌నగర్‌కు తీసుకువచ్చాడు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మ్యాన్‌హోల్‌లో పడేశాడు. అక్కడి నుంచి శంషాబాద్ తిరిగి చేరుకొని.. ఏమీ ఎరగనట్లు తన బంధువు అప్సర కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే.. సాయికృష్ణ సెల్‌ఫోన్ సిగ్నల్స్‌తోపాటు.. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా కేసును పోలీసులు ఛేదించారు. సాయికృష్ణే.. అప్సరను అంతమొందించాడని తేల్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ఘటనాస్థలిలో తహశీల్దార్ పంచనామా నిర్వహించారు.

## సమైక్య రాష్ట్రంలో అడుగడుగునా సంక్షోభం.. స్వరాష్ట్రంలో గడపగడపకు సంక్షేమం : మంత్రి కేటీఆర్



సమైక్య రాష్ట్రంలో అడుగడుగునా సంక్షోభం ఎదుర్కొన్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. అదే స్వరాష్ట్రంలో గడపగడపకు సంక్షేమం అందుతోందని .. ప్రతి కుటుంబంలో వెలకట్టలేని సంతోషం వెల్లివిరస్తోందని అన్నారు. ఇవాళ తెలంగాణలో సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని.. లబ్ధిదారుడు లేని కుటుంబం లేదని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తెలంగాణ నలుమూలలా సంక్షేమ సంబురాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒక్క సంక్షేమ రంగానికే ఏటా 50 వేల కోట్లకు పైగా నిధులు చరిత్రలో ఏ పాలకుడు చేయని సాహసమిది అని అన్నారు. ఆలోచనకు కూడా అందని భారీ మొత్తమిది అని అన్నారు. దేశ సంక్షేమ రంగం చరిత్రలోనే సరికొత్త అధ్యాయమిది అని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో అందుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను ట్విట్టర్‌లో పెట్టారు.

## మంత్రి కేటీఆర్ సవాల్‌ను స్వీకరిస్తున్నా: రేవంత్ రెడ్డి




హైదరాబాద్: పార్టీ, ప్రజల కోసం పోరాడే వారికే భవిష్యత్ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నాయకుడిగా మారేందుకు యూత్ కాంగ్రెస్ ఓ వేదిక అని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మాణిక్ రావ్ ఠాక్రేనే దీనికి ఉదాహరణ అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. దాదాపు 1200 మంది విద్యార్థి, యువత ప్రాణ త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. భాజపా దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అని ఎద్దేవా చేశారు. దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజిన్ పని అని విమర్శించారు. “ వన్ నేషన్ వన్ పార్టీ అనేది భాజపా రహస్య అజెండా. భాజపా కుట్రలను ఛేదించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేద్దాం. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం మీరంతా కష్టపడాలి. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి కానుకగా ఇవ్వాలి.” అని యువనాయకులను ఉద్దేశిస్తూ రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ చేసిన సవాల్‌ను స్వీకరించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి, 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ‘ 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం. 2014 తర్వాత జరిగిన అభివృద్ధిపై కేటీఆర్, హరీశ్ చర్చకు సిద్ధమా?’ అని రేవంత్ అన్నారు.“ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. అత్యంత కీలకమైన ఐదు అంశాలతో ప్రజలవద్దకు వెళ్తాము. అగ్రనాయకులు అందుబాటులో ఉండే అవకాశాన్ని బట్టి బహిరంగ సభలు ఉంటాయి. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.” అని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ క్రియాశీల పాత్రపై సమావేశంలో చర్చించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. “ 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి. దీనికి అవసరమైన కార్యాచరణపై యూత్ కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశాం. క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసిన వారు.. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నాయకులవుతారని చెప్పాం. మోదీ, కేసీఆర్‌లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీలకంగా పని చేయాలి.'' అని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించేందుకే కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని రేవంత్ విమర్శించారు. “ కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌ను కచ్చితంగా రద్దు చేస్తాం. రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజిగిరి భూముల్లో అవకతవకలు జరిగాయి. వేల ఎకరాల భూమిని కేసీఆర్.. బినామీలకు కట్టబెట్టారు. ప్రభుత్వ అధికారుల దగ్గర ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిపోయింది. ధరణి రాకముందు రైతు బంధు రాలేదా?” అని ప్రశ్నించారు.

## అందుకే ఈనెల 15న ఖమ్మంలో అమిత్‌షా సభ: బండి సంజయ్



ఖమ్మం: అప్పుల రాష్ట్రం అభివృద్ధి రాష్ట్రంగా మారాలని కోరుకుంటున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భాజపా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో భాజపా లేదని కొందరు అవమానిస్తున్నారన్నారు. జిల్లా ప్రజలకు భరోసా కల్పించేందుకే కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఈనెల 15న సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ సభకు భారీగా తరలివచ్చి భాజపా బలమేంటో ఇక్కడి కార్యకర్తలు చూపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో కమలం తప్పకుండా వికసిస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## దారి కాచిన మృత్యువు... ముగ్గురి మృతి



వైరా: ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వైరా మండలం స్టేజీ పినపాక వద్ద లారీ, కారు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారులోని ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితులను సత్తుపల్లి నియోజవర్గ పరిధిలోని కల్లూరు మండలం లాక్యాతండాకు చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు. కారును లారీ ఢీ కొన్న తర్వాత కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ.. రూ.1.63 కోట్ల లావాదేవీలు: సిట్

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు నాంపల్లి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు రూ. 1.63 కోట్ల లావాదేవీలు జరిగినట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నిందితులకు సంబంధించిన ఖాతా వివరాలు, చేతుల మారిన నగదు వివరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరికొంత మందిని అరెస్టు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకు 49 మందిని సిట్ అధికారులు అరెస్టు చేయగా.. వీరిలో 16మంది మధ్యవర్తులుగా ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన ప్రశాంత్ మరో నిందితుడు న్యూజిలాండ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఏఈఈ ప్రశ్నపత్రం లీకైన తర్వాత 13 మందికి, డీఏవో పేపర్ 8మందికి, గ్రూప్-1 ప్రిలిమ్స్ నలుగురికి చేరినట్లు గుర్తించినట్లు తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ చేరిన నలుగురిలో టీఎస్‌పీఎస్సీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు ఉండగా.. మరో వ్యక్తి బయటివాడని తేల్చినట్లు వివరించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో దశలోనే ఉన్నట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఇటీవల అరెస్టయిన డీఈ పూల రమేష్ సహకారంతో ఏఈఈ, డీఏవో పరీక్షల్లో చూచిరాతకు పాల్పడిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలను రామంతాపూర్‌లోని సెంట్రల్ ఫోరెనిక్స్ సైన్స్ లాబోరేటరికి పంపించినట్లు తెలిపారు. వాటిని విశ్లేషిస్తున్న క్రమంలో మరికొంత సమాచారం బయటికి వచ్చినట్లు వెల్లడించారు. డీఈ రమేష్ ఏఈఈ ప్రశ్నపత్రాన్ని మరికొంత మందికి విక్రయించినట్లు సిట్ అధికారులు భావిస్తున్నామని చెప్పారు. దీన్ని బట్టి ఈ కేసులో అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. తర్వాత కేసు దర్యాప్తులో తేలే మిగతా నిందితులను బట్టి అనుబంధ అభియోగపత్రం దాఖలు చేయాలని భావిస్తున్నట్లు సిట్ అధికారులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.

## 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు.. వెబ్‌సైట్‌లో అందుబాటులో హాల్‌టికెట్లు



హైదరాబాద్: ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు నేరుగా ఈ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అయితే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు వస్తే, వారిని తప్పకుండా అనుమతించాలని బోర్డు అధికారులు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. హాల్ టికెట్లపై ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్ సంతకాలు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్ కూడా తమ లాగిన్ల ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయొచ్చు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com